



THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 44 సంచిక : 5 05.07.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

మహానేతా మన్నించు..!

## నాన్న అలా.. కొడుకు ఇలా..!



జనసేవే పరమావధిగా సాగిన రాజశేఖరరెడ్డి పాలన

ధనార్జనే తన విధిగా కొనసాగిన జగన్ పరిపాలన



జూలై 8న.. రాజశేఖరరెడ్డి 75వ జయంతి

**ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. గత 20 సంవత్సరాలుగా అంటే 2004 నుండి 2024 దాకా ప్రజల మనసుల్లో దైవంగా నిలచిన దివంగత రాజశేఖరరెడ్డి, ఇప్పుడు ఒక్కసారిగా పగవాడిగా మారిపోయారు. ఇన్నాళ్లూ ఆయన ఫోటోని తమ పూజ గదుల్లో, ఆయన జ్ఞాపకాలని తమ గుండెల్లో పెట్టుకున్న తెలుగు జనం ఇప్పుడు ఆయన పేరెత్తితేనే ముఖ కవళికలు మార్చుకునే పరిస్థితి వచ్చింది.**

తనకి ఒక్కసారి అవకాశమిస్తే తన నాన్న ఫోటో పక్కనే తన ఫోటో కూడా పెట్టుకునేలా పరిపాలిస్తానన్నారు వై.ఎస్. కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డి. కానీ, జగన్ అయిదేళ్ళు ఆంధ్రాని పరిపాలించిన తరువాత... జగన్ ఫోటో తమ ఇంట్లో పెట్టుకోకపోగా పదిహేనేళ్ళుగా తమ ఇంట్లో ఉన్న మహానేత ఫోటోని, ఇరవై సంవత్సరాలుగా తమ హృదయాల్లో కొలువైన రాజశేఖరరెడ్డి స్మృతులని జనం చెరిపేసుకునే స్థాయికి వై.ఎస్. కుటుంబ ప్రతిష్ట పడిపోయింది.

**జులై 8, 2024న మహానేత డాక్టర్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి.**

ఆ సందర్భంగా ఆయన కుమారుడు జగన్, కుమార్తె షర్మిల ఆయనకిచ్చిన ఇలాంటి బహుమతి చూసి వై.ఎస్. అభిమానులు, ఆయన అనుచరులు, సమకాలీకులు మనోవేదన చెందుతున్నారు. రాజకీయ మంటల్లో తగలబడుతున్న రాజన్న విగ్రహాలని చూసి మౌనంగా రోదిస్తున్నారు. ముక్కలుగా మారుతున్న మహానేత శిలాఫలకాలను నిశ్చేష్టులై చూస్తున్నారు.

10లో

## కొత్త కలెక్టర్‌గా ఓ.ఆనంద్ బాధ్యతల స్వీకరణ!



రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకి చేరువ చేస్తా!

3లో



కిలారి వెంకటస్వామి నాయుడు

జననం : 09.07.1959 నిర్యాణం : 25.06.2024

ఉత్తరక్రియలు

మనసున్న నాయకుడు, అలుపెరుగని సేవకుడు
మా కుటుంబ కీర్తి, మా అభివృద్ధికి స్ఫూర్తి

శ్రీ కిలారి వెంకటస్వామి నాయుడు గారు

(మాజీ ఛైర్మెన్, జిల్లా గ్రంథాలయ సంస్థ, నెల్లూరు)

తేది. 25.06.2024 మంగళవారం స్వర్గస్తులైనారు.

వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

భార్య : కిలారి వనజాక్షి

కుమారుడు

కిలారి వరుణ్ కుమార్ (రాజా)

కుమార్తె - అల్లుడు

హిందూజ వద్దినేని - శ్రీహరి వద్దినేని

మనుమలు

రేయాన్ష్ వద్దినేని, ధన్విత్ తేజ వద్దినేని

ఉత్తరక్రియలు

వారి పెద్దకర్మ తేది. 11.07.2024 గురువారం ఉదయం 10.00 గంటలకు నెల్లూరు, బి.వి.నగర్ (సాయిబాబా గుడి వెనుక) మా స్వగృహము నందు జరుగును. కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది.


# విద్యార్థుల భవితను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే!

## ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల



విద్యార్థుల జీవితాలకు వెలుగుబాటలు వేస్తూ, వారిని భావిభారత పౌరులుగా తీర్చి దిద్దేది ఉపాధ్యాయులేనని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కొనియాడారు. ఇటీవల ఆయన వరికుంటపాడు మండలం తిమ్మారెడ్డిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదవీ విరమణ పొందిన గణిత ఉపాధ్యాయుడు గుర్రంకొండ వెంకటసుబ్బయ్య సన్మానసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యామంత్రి లోకేష్‌ల సారథ్యంలో విద్యార్థులకు మేలు కలిగేవిధంగా విద్యారంగంలో వినూత్నమైన మార్పులు సంతరించుకోబోతున్నాయని చెప్పారు. ఎమ్మెల్యేతో పాటు ఎంపిపీ సుంకర వెంకటాద్రి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సుంకర అంజనాద్రి, టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్ పాల్గొని ఆ ఉపాధ్యాయుని ఘనంగా సన్మానించారు. ఎంఇఓ షేక్ షావుద్దీన్, మండల మాజీ కన్వీనర్ వెంకయ్య, మండల తెలుగుయువత అధ్యక్షులు ఎం.లక్ష్మీనారాయణ, జనసేన-బీజేపీ నాయకులు షేక్ పఠాన్‌రసూల్, ఏనుగు ప్రభాకర్‌రెడ్డి, స్వచ్ఛంధసంస్థ ప్రతినిధి నూనె ప్రసాద్, పేరం సుధాకర్‌రెడ్డి, పి.మాధవరావు, ఉదయశంకర్‌రెడ్డి, రవికుమార్, డి.పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి



- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి

విద్యార్థుల సమస్యలు తీర్చి, వారికి మెరుగైన విద్యనందించాలని తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. ఆయన ఇటీవల ఒంగోలు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు. జిల్లాలో విద్యార్థులకు విద్యాసామగ్రి కిట్స్ పంపిణీ సరిగా జరగడంలేదని, ఇప్పటి వరకు కేవలం 60 శాతం పాఠశాలల్లో మాత్రమే వాటిని పంపిణీ చేశారని, మిగిలిన విద్యార్థులకు కూడా వాటిని వెంటనే పంపిణీ చేయాలని ఆయన విద్యాశాఖ అధికారులను కోరారు. పలు ప్రభుత్వ పాఠశాలల్లో కొన్ని సబ్జెక్టులకు సంబంధించిన టెక్ట్స్‌బుక్స్ విద్యార్థులకు ఇంకా అందలేదని, అనేక పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్స్ కొరత ఉందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చాలాచోట్ల నైట్ వాచ్‌మెన్ నియామకాలు జరగలేదని, దీనివల్ల పాఠశాలలకు ప్రభుత్వం ఇచ్చిన విలువైన విద్యాసామగ్రికి రక్షణ లేకుండా పోయిందన్నారు. పాఠశాలల్లో నైట్ వాచ్‌మెన్ నియామకాలు చేపట్టాలన్నారు. పాఠశాలల్లో ఆర్ట్స్ గ్రూప్‌తో పాటు సైన్స్ గ్రూపులు కూడా ప్రవేశపెట్టాలన్నారు. పదవ తరగతి ఫలితాల్లో ఏ యజమాన్య పాఠశాల నుంచి ఎంతమంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు, ఎంతమంది ఉత్తీర్ణత సాధించారనే వివరాలను, అన్ని పాఠశాలల డేటాను విడివిడిగా అందించాలని అధికారులకు సూచించారు. పలు పాఠశాలల్లో ఐఎఫ్‌పి ప్యానల్ బోర్డులను వినియోగంలోకి తీసుకురావడం లేదని, అధికారులు వాటిపై కూడా దృష్టి సారించాలని ఆయన కోరారు.

# 'డైట్'..జూనియర్ అసిస్టెంట్‌కు ఘనంగా వీడ్కోలు



ఇందుకూరుపేట మండలం, పల్లిపాడులోని ప్రభుత్వ 'డైట్' విద్యాసంస్థలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎన్ మధుసూదన్‌రావు ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. 35 సంవత్సరాలకుపైగా కావలి, పల్లిపాడు విద్యాసంస్థల్లో జూనియర్ అసిస్టెంట్‌గా వృత్తి పట్ల అంకితభావంతో పనిచేసిన మధుసూదన్‌రావు శేషజీవితం హాయిగా గడపాలని ప్రిన్సిపాల్ ఈ సందర్భంగా ఆకాంక్షించారు. పలువురు సీనియర్ ఉపన్యాసకులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొని ఆయనకు వీడ్కోలు శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్ అధ్యాపకులు డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, ఉపన్యాసకులు కె.విజయచంద్ర, డి.నరసింగరావు, యస్.బోయదాస్, యన్.శివ, సి.సోమేశ్వర్, కె.షఫీ అహ్మద్, సూపరింటెండెంట్ ఎస్.సురేష్, సిబ్బంది, ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.

## వ్యక్తిత్వ వికాసానికి మూలస్తంభాలు..

# మన ప్రాచీన గ్రంథాలు

శ్రీసిటీలో యువ ప్రవచనకర్త గంగిశెట్టి లక్ష్మీనారాయణ



నేటి ఆధునిక యుగంలో వ్యక్తిత్వ వికాసాన్ని ఒక పాఠ్యాంశంగా పరిగణిస్తున్నారని, అయితే.. ప్రాచీనకాలం నాటి మన వేదాలు, పురాణాలు, కావ్యాల్లోనే వ్యక్తిత్వ వికాసం గురించి అనేక అంశాలు చాలా గొప్పగా వివరించివున్నాయని యువ ప్రవచనకర్త గంగిశెట్టి లక్ష్మీనారాయణ చెప్పారు. శ్రీసిటీ ఆధ్యాత్మిక, సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో ఇటీవల స్థానిక బిజినెస్ సెంటర్‌లో నిర్వహించిన 'సంస్కృతాంధ్ర వాఙ్మయంలో వ్యక్తిత్వ వికాసం' అనే అంశంపై ఆయన ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. వ్యక్తిత్వ వికాసానికి మూలస్తంభాలు మన ప్రాచీన గ్రంథాలేనని ఆయన పేర్కొంటూ, ఈ సందర్భంగా పలు గ్రంథాల్లోని సంస్కృత సాహిత్యాన్ని, తెలుగులో దాని అర్థాలను ఉదాహరణలతో సహా వివరించారు. సనాతన విద్యావ్యవస్థ విలక్షణతను ప్రస్తావిస్తూ, తైత్తిరీయ ఉపనిషత్తులోని శిక్షావల్లిలో పేర్కొన్న విధంగా గురు-శిష్య సంబంధాన్ని ఆయన సోదాహరణంగా వివరించారు. ప్రాచీనకాలంలో గురువులు విద్యార్థులను తమకంటే మిన్నగా రాణించేలా ప్రోత్సహించేవారని చెబుతూ, 'సత్యం పలకండి, మీ ధర్మాన్ని నిర్వర్తించండి'.. 'తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అతిథులను దేవతలుగా గౌరవించండి' అని ఉద్బోదించేవారని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమం గురించి శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్పందిస్తూ.. ఆధ్యాత్మిక సాహిత్య వికాసానికి శ్రీవాణి వేదిక నిరంతరం పని చేస్తోందన్నారు. డాక్టర్ లక్ష్మీనారాయణ వంటి పలువురు ప్రముఖ వక్తల ప్రసంగ కార్యక్రమాలను ఏర్పాటుచేయడం ద్వారా సమాజంలో స్ఫూర్తిని నింపేందుకు, విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నామన్నారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ రమేష్‌కుమార్ లక్ష్మీనారాయణను శాలువతో సత్కరించి జ్ఞాపికను అందచేశారు. శ్రీసిటీ ఉద్యోగులు, పరిసర గ్రామాలకు చెందిన ఆధ్యాత్మిక సాహిత్యాభిమానులు పాల్గొన్నారు. శ్రీసిటీ పీఆర్ఓ రవీంద్రనాథ్ ప్రయోక్తగా వ్యవహరించారు.

# ఆరంబాకం సేవలు అపారం

## డెప్యూటీ మేయర్ రూప్ అభినందన



నెల్లూరు నగరంలోని మూలాపేట శ్రీ మూలస్థానేశ్వరస్వామి వారి దేవస్థానంలో కార్యనిర్వాహణాధికారిగా విధులను నిర్వహిస్తున్న ఆరంబాకం వేణుగోపాల్ ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా నగర డెప్యూటీ మేయర్ పోలుబోయిన రూప్‌కుమార్‌యాదవ్ ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఆలయ అభివృద్ధికి ఆరంబాకం వేణుగోపాల్ చేసిన సేవలు అపారమని కొనియాడుతూ, ఆయన శేష జీవితం హాయిగా గడపాలని ఆకాంక్షించారు. టీడీపీ నాయకుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, దేవస్థానం ఛైర్మెన్ లోకిరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, దేవాదాయశాఖ అధికారులు పాల్గొన్నారు..

## విఎస్‌యు ఇన్‌చార్జి

# రిజిస్ట్రార్‌గా డా. సునీత



నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ఇటీవల డా. కె సునీత బాధ్యతలు స్వీకరించారు. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో సోషల్ వర్క్ విభాగంలో ఎన్నో సంవత్సరాల నుండి సహాయ ఆచార్యురాలిగా, స్పోర్ట్స్ బోర్డ్స్ కార్యదర్శిగా పలు కీలకమైన విభాగాల్లో కూడా ఆమె విధులు నిర్వహించారు. ఆమె సేవలను గుర్తించిన విశ్వవిద్యాలయం ఆమెకు ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విశ్వవిద్యాలయం అభివృద్ధికి, విద్యార్థుల మంచి భవిష్యత్తుకి తనవంతు కృషిచేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆచార్య జి.విజయానందకుమార్‌బాబు, డా.ఆర్.మధుమతి, సుజా ఎస్ నాయర్, డా.సాయిప్రసాద్‌రెడ్డి, సహాయ రిజిస్ట్రార్ జి.సుజయ్‌కుమార్ పాల్గొని ఆమెను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

# వేడుకగా.. దుర్గమ్మ జాతర



మనుబోలు మండలంలోని యాచవరం గ్రామపొలాల్లో వెలసివున్న గ్రామదేవత.. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి దుర్గమ్మతల్లికి ఇటీవల గ్రామస్తులు అంగరంగ వైభవంగా జాతర నిర్వహించారు. మూడేళ్ళకోసారి ఎంతో వేడుకగా చేసే ఈ జాతరలో గ్రామస్తులంతా పాల్గొని, సకాలంలో వర్షాలు కురిసి ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ అమ్మవారిని ప్రార్థించారు. పెద్దసంఖ్యలో మహిళలు ఈ జాతరలో పాల్గొన్నారు. ప్రతి ఇంటినుంచి పొంగళ్ళు వండి బుట్టల్లో పెట్టుకుని ఊరేగింపుగా దుర్గమ్మ గుడివద్దకు వచ్చి, అమ్మవారికి పూజలు చేసి, నైవేద్యం సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

# ఐఎంఏ ఆధ్వర్యంలో.. మెగా రక్తదాన శిబిరం



డాక్టర్స్ డే సందర్భంగా ఇటీవల కావలిలోని రెడ్‌క్రాస్ భవనంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆ శిబిరాన్ని ప్రారంభించి, ఐఎంఏ వైద్యులను, రెడ్‌క్రాస్ సేవలను అభినందించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఈ శిబిరంలో సుమారు 12వందల మంది రక్తదానం చేయడం సంతోషకరమని అన్నారు. రక్తదానం పట్ల అందరూ అవగాహన పెంపొందించుకోవాలన్నారు. రక్తదానం ద్వారా బాధితులను ఆదుకునేందుకు యువత ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా, 65 సార్లు రక్తదానం చేసిన రక్తదాత కండ్లగుంట మధుబాబునాయుడును ఆయన సన్మానించారు. ఆర్డీఓ శీనానాయక్, రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రం కన్వీనర్ డాక్టర్ బి.రవికుమార్, ఐఎంఏ కావలి శాఖ అధ్యక్షులు డాక్టర్ కె.సుబ్బారావు, కార్యదర్శి డాక్టర్ వి.గోపి, రెడ్‌క్రాస్ ప్రతినిధులు డి.రవిప్రకాష్, కె.హరినారపరెడ్డి, ఐఎంఏ ప్రతినిధులు డాక్టర్ నళిని పద్మ, డాక్టర్ పద్మజ, డాక్టర్ ఏ.శ్రీనివాసులు, డాక్టర్ సతీష్, డాక్టర్ ఉషారాణి, డాక్టర్ ప్రమీల, డాక్టర్ రేవంత్, స్వచ్ఛంధసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కొత్త కలెక్టర్‌గా.. ఓ.ఆనంద్



నెల్లూరుజిల్లా కొత్త కలెక్టర్‌గా ఓ.ఆనంద్ ఈనెల 4న గురువారం ఉదయం వేదపండితుల వేదాశీర్వచనాలతో నెల్లూరులోని కలెక్టరేట్‌లో బాధ్యతలు చేపట్టారు. జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్, కందుకూరు సబ్‌కలెక్టర్ విద్యాధరి, ఇన్‌చార్జి డిఆర్‌ఓ పద్మావతి నూతన కలెక్టర్‌ను స్వాగతించారు.

## రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకి చేరువ చేస్తా..!

కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, గతంలో ఉమ్మడి నెల్లూరుజిల్లా గూడూరులో సబ్‌కలెక్టర్‌గా తాను విధులు నిర్వహించడం జరిగిందని, ఆ తర్వాత నెల్లూరుజిల్లా కలెక్టర్‌గా రావడం సంతోషంగా ఉందని అన్నారు. ప్రభుత్వ అభివృద్ధి పథకాలను, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందించేందుకు కృషిచేస్తానని, అదేవిధంగా ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగిన నేపథ్యంలో నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా ఉన్న హరినారాయణన్‌ను బదిలీ చేసి, ఆయన స్థానంలో ఆనంద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఈనెల 2న ఉత్తర్వులిచ్చింది. విశాఖపట్టణం వాణిజ్యపన్నుల శాఖలో జాయింట్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఓ.ఆనంద్ తాజాగా నెల్లూరుజిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

2016 ఐఏఎస్ బ్యాచ్‌కి చెందిన ఆనంద్ స్వస్థలం కేరళలోని మలప్పురం. త్రివేండ్రంలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్‌లో ఇంజనీరింగ్ పూర్తిచేశారాయన. ఆ తర్వాత ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. అసిస్టెంట్ కలెక్టర్‌గా చేరడానికి ముందు ముస్సోరీలోని లాల్‌బహదూర్‌శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌లో ఏడాదిపాటు శిక్షణ పొందారు. తొలిసారిగా 2018లో నెల్లూరుజిల్లా గూడూరులో సబ్‌కలెక్టర్‌గా చేరారు. 2019 ఎన్నికలప్పుడు గూడూరు రిటర్నింగ్ అధికారిగా కూడా నిబద్ధతతో విధులు నిర్వహించారు. ఆ తర్వాత పోలవరం ప్రాజెక్టు ప్రత్యేకాధికారిగా, అనంతరం పార్వతీపురం మన్యం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్‌గా, ఆ తర్వాత అదేజిల్లాకు జాయింట్ కలెక్టర్‌గా కూడా సమర్థవంతంగా పనిచేశారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో సబ్ కలెక్టర్‌గా పనిచేసిన అనుభవం ఉంది కనుక, జిల్లాకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ఆయన చొరవ తీసుకుంటారని ఆశించవచ్చు. కొత్త కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆనంద్‌కు...'లాయర్' శుభాకాంక్షలు.

## చెట్లు నరకలేదు, పరదాలు కట్టలేదు, అంగళ్ళు మూయలేదు

# నెల్లూరుకి జగన్ వచ్చారు... వెళ్లారు!




"హమ్మయ్య జగన్ వచ్చి పోయారు". గురువారం నెల్లూరీయులు విడిచిన నిట్టూర్పు ఇది. నెల్లూరు కేంద్ర కారాగారంలో ఉన్న వైసీపీ మాజీ శాసనసభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని చూడడానికి గురువారం ఉదయం మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు వచ్చి వెళ్లారు. తాడేపల్లి నుండి హెలికాప్టర్లో వచ్చి కనుపర్తిపాడు జడ్పీ స్కూలులో వాలిన జగన్, అక్కడ నుండి రోడ్డు మార్గాన కేంద్ర కారాగారానికి వచ్చి పిన్నెల్లిని ఓదార్చి, అక్కడ మీడియాతో మాట్లాడి తిరిగి అదే హెలికాప్టర్లో తాడేపల్లికి ఎగిరిపోయారు.

### ఈ పర్యటనలో స్టైల్ మారింది!

గతంలో ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తాడేపల్లికి దగ్గరలో ఉన్న ఒంగోలు, కావలి, నెల్లూరు ఎక్కడికి రావాలన్నా తిరుపతికి ప్రత్యేక విమానంలో వచ్చి, అక్కడనుండి మరో ప్రత్యేక హెలికాప్టర్లో ప్రయాణంచేసి గమ్యస్థానం చేరుకునే వారు. ఈసారి తాడేపల్లి నుండి నెల్లూరుకే నేరుగా హెలికాప్టర్లో వచ్చారు. ఆయన ఈ పర్యటన కోసం చెట్లు నరకలేదు, పరదాలు కట్టలేదు, అంగళ్ళు మూయలేదు. ఎప్పుడూ మీడియా ముఖమైనాచూడని జగన్ ఈసారి మీడియాతో ముచ్చటించారు.

### లెక్కజమ చేసి.. త్వరలోనే బుద్ధి చెప్తాం! - మీడియాతో జగన్

తమ పార్టీ శ్రేణులపై అక్రమ కేసులు పెడుతున్నారని, దాడులు చేస్తున్నారని జగన్ ఆవేదన వ్యక్తంచేశారు. శిశుపాలుడి పాపాల లాగా చంద్రబాబునాయుడి పాపాలు పండుతున్నాయన్నారు. అన్నీ లెక్క జమచేసి చంద్రబాబునాయుడికి గట్టిగా బుద్ధిచెప్పే రోజులు తొందరలోనే ఉన్నాయని జగన్ చెప్పారు.

10 లో

# జయభారత్ ఆసుపత్రికి గునుపాటి శ్యామలమ్మ రూ.15 లక్షల విరాళం

## ➤ లక్షా 23 వేలు ఇచ్చిన బెజవాడ శ్రీకృష్ణారెడ్డి







సింహపురి సేవాసమితి ఆధ్వర్యంలో పేద కుటుంబాల ఆరోగ్య సంరక్షణ కోసం పనిచేస్తున్న నెల్లూరులోని జయభారత్ ఆసుపత్రికి సహాయం చేయడానికి సహృదయంతో దాతలు ముందుకొస్తున్నారు.

ఆసుపత్రిలో కంటి వైద్య విభాగంలో అవసరమైన వైద్య పరికరాల కొనుగోలు కోసం ప్రముఖ కాంట్రాక్టర్, వ్యాపారవేత్త, ఆతిథ్య సారథి, సినీ నిర్మాత స్వర్గీయ గునుపాటి హరిశ్చంద్రారెడ్డి స్మృత్యంకంగా ఆయన శ్రీమతి గునుపాటి శ్యామలమ్మ, కుమారుడు జి.వి.ప్రసాద్‌రెడ్డి (రెడ్డిల్యాబ్స్) జయభారత్‌కి 15లక్షలు విరాళంగా అందించారు. ఈ మొత్తాన్ని వినియోగించి ఆసుపత్రి కంటి వైద్య విభాగానికి అవసరమైన బి-స్కాన్, ఫండస్ కెమెరాలని ఆసుపత్రి నిర్వాహకులు కొనుగోలు చేశారు. ఇదే కంటి వైద్య విభాగంలో అవసరమైన "స్లిట్ లాంప్" కొనుగోలు చేయడానికి బెజవాడ శ్రీకృష్ణారెడ్డి తమ ముగ్గురు సోదరీమణులు దొడ్ల వెంకటశేషమ్మ, దొడ్ల లలితమ్మ, దొడ్ల పద్మినిల జ్ఞాపకార్థం లక్షా ఇరవై మూడు వేల(1,23,000) రూపాయలను అందించారు. సింహపురి సేవా సంస్థ ఛైర్మెన్ పొన్నలూరు సీతారామిరెడ్డి ద్వారా ఈ మొత్తాన్ని అందించగా జులై3వతేదీ బుధవారం ఆసుపత్రిలో ఆ వైద్య పరికరాలని సీతా రామిరెడ్డి ప్రారంభించారు.

## రోటరీ జిల్లా 3160 అధ్యక్షుడిగా

# బెజవాడ నరేష్ చంద్రారెడ్డి



రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ 3160కి కొత్త కళ వచ్చింది. 2024-25 సంవత్సర కాలానికి నూతన అధ్యక్షుడిగా బెజవాడ నరేష్‌చంద్రారెడ్డి గత శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు.

రోటరీ జిల్లా 3160 పూర్వ గవర్నర్ రొటేరియన్ దొడ్ల భరత్‌కుమార్‌రెడ్డి, మరో పూర్వ గవర్నర్ ముని గిరీష్ సమక్షంలో, రోటరీ డిస్ట్రిక్ట్ 3020 పూర్వ గవర్నర్ రొటేరియన్ జి.విశ్వనాథ్ నరేష్‌రెడ్డికి అధ్యక్ష బాధ్యతలు అప్పజెప్పారు. నరేష్‌రెడ్డితో పాటు కార్యదర్శిగా పి.అఖిలేష్‌రెడ్డి, ఇతర ఆఫీస్ బేరర్ల బృందం కూడా బాధ్యతలు చేపట్టారు.

క్యాన్సర్ వ్యాధి సోకడానికి గల కారణాలు వివరిస్తూ, ఆ మహమ్మారి పట్ల అవగాహన కల్పించడం ఈ కమిటీ లక్ష్యం. ముఖ్యంగా పాఠశాలలకి వెళ్ళే చిన్నారులను చైతన్యపరచి, సహజసిద్ధమైన ప్రకృతి ద్వారా ఆరోగ్యాన్ని సంరక్షించుకోవడం పట్ల వారిలో స్ఫూర్తి నింపడం కూడా ఈ కొత్త కమిటీ ప్రధాన బాధ్యత.

గ్రామాలలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం, నెల్లూరులోని రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి ఒక బస్సును సమకూర్చి ఆ బస్సు ద్వారా గ్రామాలలో క్యాన్సర్ పట్ల గ్రామీణ ప్రాంత ప్రజలని అప్రమత్తం చేయడం కూడా వీరి విధి. అదే వాహనంలో క్యాన్సర్ వ్యాధిని ప్రాథమికంగా గుర్తించే పరీక్షా పరికరాలని కూడా ఏర్పాటు చేస్తారు.

ఇన్నాళ్ళూ తెరవెనుకే వుండి తన సేవలు అందించిన నరేష్‌రెడ్డి ఇన్నాళ్ళకి తెరముందుకి వచ్చారు. కష్టపడి పని చేయడం, తీసుకున్న బాధ్యతలని అంకితభావంతో పూర్తి చేయడం నరేష్‌రెడ్డి నైజం. పాత రోజుల్లో నిత్యం అనేక సేవా కార్యక్రమాలతో వార్తల్లో వుంటూ వచ్చిన రోటరీ 3160 విభాగం ఎందుకనో చాన్నాళ్ళుగా స్తబ్దుగా వుంది. ఇప్పుడు నరేష్‌రెడ్డి రాకతో ఆ విభాగంలో సందడి నెలకొంది. ఆయన నాయకత్వంలో సంస్థకి పూర్వవైభవం వస్తుందని సాటి సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.




లాయర్
జులై 05, 2024

# జటిలంగా మారుతున్న..జనాభా సమస్య

అధిక జనాభాతో ప్రపంచవ్యాప్తంగా అనేకదేశాల్లో సమస్యల సవాళ్ళు పెరిగిపోతున్నాయి. మనదేశంలోనూ అంత కంతకూ పెరుగుతున్న జనాభాతో సమస్యలు రానురాను మరింత జటిలంగా మారుతున్నాయి. కన్నుమూసి తెరిచేలోగా జనాభా సూచిక అమాంతం పరుగులు పెడుతుండడం చూస్తే, రానున్న కాలంలో మరెన్ని కష్టాలు దాపురించనున్నాయో ఊహించుకోవచ్చు. జనాభాతో పోటీపడుతూ పేదరికం, నిరుద్యోగం, సామాజిక అసమానతల వంటివి ఇక తగ్గనంత స్థాయికి ఎదిగిపోతున్నాయి. అందుకే, జనాభా అపరిమితంగా పెరిగితే దానివల్ల గొలుసుకట్టుగా కలిగే అనర్థాలెన్నో ఉన్నాయని, కనుక జనాభా నియంత్రణ ముఖ్యమని ఐక్యరాజ్య సమితి ఎప్పటినుంచో హెచ్చరిస్తూనే ఉంది. అయినా, పట్టించుకునేదెవరు?.. ఫలితంగా మనదేశంతో పాటు, అనేకదేశాలు అధిక జనాభాతో అవస్థలు పడుతూనే ఉన్నాయి.

ఏ మనిషికైనా తినేందుకు తిండి, కట్టుకునేందుకు బట్ట, ఉండేందుకు గూడు తప్పనిసరి. తాగేందుకు నీళ్ళు ఎటూ ఉండాల్సిందే. అయితే, కేవలం అవిమాత్రమే ఉంటే చాలదు కదా.. మానవ మనుగడకు ఎన్నో సదుపాయాలు ఉండి తీరాల్సిందే. అందుకు తగ్గట్టుగా వనరులు ఉంటే తప్ప జీవితం సాగడం సాధ్యం కాదు. ప్రపంచవ్యాప్తంగా నానాటికీ ఆధునికత శరవేగంగా పెరిగిపోతున్న నేటి పరిస్థితుల్లో మనిషి ఆధునిక సౌకర్యాల కోసం వెంపర్లాడుతున్నాడు. దానికి తోడు జనాభా భారీగా పెరుగుతుండడంతో మానవాళి మనుగడ ప్రశ్నార్థకంగా తయారైంది. ప్రకృతిని కాపాడుకోలేకపోవడం వల్ల భూగోళం నిప్పుల గోళంగా మారి, వాతావరణం పూర్తిగా మారిపోయి, మనిషితో పాటు అన్ని జీవుల మనుగడకు ముప్పు వాటిల్లుతోంది. అనునిత్యం కోట్లాది టన్నుల వ్యర్థాలతో ధరిత్రి దుర్గంధభూయిష్టంగా తయారైపోతోంది. మరోవైపు, నిత్యం పెరిగిపోతున్న కోట్లాది టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాల పెనుముప్పు భూగోళాన్ని భయకంపితం చేస్తూనే ఉంది. పచ్చని ప్రకృతికాలవాలమైన చెట్లు, పెద్ద పెద్ద వృక్షాలతో సహా అటవీ సంపద హరించుకుపోతోంది. సముద్ర తీరాల్లో రక్షణగా ఉండే మడ అడవులు మట్టిగొట్టుకుపోతున్నాయి. ఎక్కడబట్టినా నదీనదాలు, జలవనరులు కలుషితమవుతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. సముద్రాలు సైతం కాలుష్య కాసారాలుగా మారిపోతున్నాయి. తినే తిండి, పీల్చే గాలి, తాగే నీరు అన్నీ కలుషితమైపోయి ప్రజలకు వ్యాధుల బాధలు సర్వసాధారణమైపోయాయి. పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా వనరులు లేకపోవడం ఒక పెద్ద సమస్య అయితే, ఉన్న వనరులను కాస్తా అందినకాడికి ఎవరి ఇష్టానుసారం వారు మట్టు పెడుతుండడం మరో పెద్ద సమస్య. ఆకలి బాధలు తట్టుకోలేక నేటికీ నిరుపేద ప్రజలు అల్లాడుతున్నా పట్టించుకునేవారు లేరు. దేశంలో ఆహార భద్రత అంతంతమాత్రమే. అందరికీ ఆహారం, అందరికీ ఉద్యోగం, ఉపాధి వంటివి నామమాత్రంగానే ఉంటున్నాయి. ఎక్కడ చూసినా కల్తీలే రాజ్యమేలుతున్నాయి. ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి ధనార్జనపరులు ప్రతి వస్తువును కల్తీచేస్తున్నా వాటిని నియంత్రించే వ్యవస్థలు మనదేశంలో లేకపోవడం అక్రమార్కులకు వరంగా మారుతోంది. లెక్కలేనన్ని వ్యాధులు, చెప్పలేనన్ని జబ్బులు ప్రజలను చుట్టుముడుతూనే ఉన్నాయి.

మనదేశంలో ఇప్పటికే జనాభా 144 కోట్లు దాటిపోయింది. ప్రపంచ జనాభా 811 కోట్లకుపైగా ఉంటే, అందులో మన దేశానిదే అగ్రస్థానం. జనాభా ఇంత విపరీతంగా ఉన్న మనదేశంలో, ఉన్న ప్రకృతివనరులను, మానవ వనరులను సద్వినియోగం చేసుకునే పరిస్థితి లేకపోవడం ఒక పెద్ద లోపం. ప్రకృతి సంపదను అక్రమార్కులు తమ స్వార్థం కోసం విధ్వంసం చేస్తున్నా అటు ప్రభుత్వాలు కానీ, ఇటు పాలకులు కానీ పట్టించుకోకపోవడం మనదేశానికో శాపం. ఇవి చాలవన్నట్లు ధరలు ఆకాశానికంటుతుండడం చూస్తూనే ఉన్నాం. ఇకనైనా ప్రభుత్వాలు, పాలకులు మేలుకోవాలి. ఉన్న జనాభాకు అనుగుణంగా వనరులను పెంపొందించాలి. దేశానికి వెన్నెముకైన రైతులకు అన్నివిధాలా చేయూత నిస్తూ వ్యవసాయోత్పత్తులను గణనీయంగా పెంచాలి. సంపదను సృష్టించి ఉద్యోగ-ఉపాధులకు కొదవలేకుండా చూడాలి. కష్టాల నుంచి యువతను గట్టెక్కించి వారిని అన్నిరంగాల్లో ప్రోత్సహించాలి. పెరిగిపోతున్న జనాభాను నియంత్రిస్తూనే, ఆ అద్వితీయమైన మానవశక్తిని వినియోగించుకుని అద్భుతాలు సృష్టించుకోవాలి. ప్రభుత్వాలే కాక మేధావులు, నిపుణులు అందరూ కలిసి బృహత్తర ప్రణాళికలతో సమస్యలను అధిగమిస్తూ, అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం నడుం బిగించాలి. ముఖ్యంగా అన్నానికి అల్లాడే దారిద్ర్యాన్ని రూపు మాపి, ఆకలి కేకలు లేని భారతావనిని సాకారం చేసుకోవాలి.

# సత్యపీఠం

నిజాలే మాట్లాడుకుందాం! 45

## పందాలతో పతనం!

"బెట్టింగ్"... మన తెలుగు భాషలో పందెం అన్న పదానికి ఇంగ్లీష్ అనువాదమే బెట్టింగ్. అంతర్జాల యుగంలో ఈ బెట్టింగ్ అన్న పదం చాలా ప్రాముఖ్యతని సంతరించుకుంది.

ఊహ తెలిసిన పసివాడి నుండి కాటికి కాళ్ళు చాపుకున్న ముసలోడి వరకూ ఈ బెట్టింగ్ మాయలో పడి పతనమైపోతున్నారు. ముఖ్యంగా యువతీ యువకులు తమ బంగారు భవిష్యత్తుని పందేలకి తాకట్టు పెడుతున్నారు.

పందేలని నమ్ముకుని తమని తాము అమ్ముకుంటూ కుటుంబాలకి కుటుంబాలు నాశనమైపోతున్నాయి.

పాశ్చాత్య దేశాలలో క్రీడా రంగంలో ఈ బెట్టింగ్ సంప్రదాయం అనాదిగా కొనసాగుతోంది. ఆ దేశాలలో చాలాచోట్ల ఇవి చట్టబద్ధం. ఇలాంటి వాటికి అనుమతులు ఉంటాయి. అధికార ఆమోదం లభిస్తుంది.

మన దేశంలో అలా కాదు. ఇక్కడ పందాలు నిషేధం. పూర్తిగా చట్ట విరుద్ధం. అయినా అవి నిరాటంకంగా నడుస్తూనే ఉన్నాయి. ప్రభుత్వ నేతల కక్కుర్తి, అధికారుల లంచగొండితనంతో కొన్ని వేల కుటుంబాలని బలి తీసుకుంటూనే ఉన్నాయి.

బెట్టింగుకి కాదేదీ అనర్హం అన్నట్లుగా... రెజ్లింగ్(కుస్తీ పోటీలు), రేసింగ్ (గుర్రపు పందాలు, కారు పందాలు, మోటార్ సైకిల్ పందాలు), బేస్‌బాల్, చెస్, హాకీ, క్రికెట్, క్యారమ్స్, టెన్నిస్, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్ ఆటలకి తోడుగా కొత్తగా పాలిటిక్స్ (రాజకీయాలు) కూడా గత రెండు దశాబ్దాల నుండి పందాలకి వేదికగా మారాయి.

వీటితో పాటు ఇంటర్నెట్‌లో కొన్ని వందల రకాల బెట్టింగ్ ఆటలు యాప్‌ల ద్వారా నేటి ఆధునిక యుగంలో మనకి దర్శనమిస్తున్నాయి.

### యువతను చెడగొడుతున్న పందాలు!

ముఖ్యంగా భారతదేశంలో ఆడ మగ అన్న తేడా లేకుండా... యువతరాన్ని బెట్టింగ్ భూతం మింగేస్తోంది. సులభంగా డబ్బు సంపాదించవచ్చన్న మోజులో పడేసి వారిని నిలువునా ముంచేస్తోంది. వెయ్యికి ఐదువేలు, లక్షకి ఐదు లక్షలు ఇలా ఒకటికి ఐదింతలు ఆశ చూపి వారి బంగారు భవిష్యత్తుని బుగ్గి చేస్తోంది.

జులాయి సినిమాలో ఒక సన్నివేశం ఉంది...

"ఓ పదివేలు ఇవ్వు రెండుగంటల్లో లక్ష చేసి చూపిస్తా" అంటూ ఆ సినిమా హీరో అల్లు అర్జున్ తన తండ్రి తనికెళ్ళ భరణితో ఛాలెంజ్ చేస్తాడు. తండ్రి ఇచ్చిన డబ్బులు తీసుకుని వెళ్ళి క్రికెట్ బెట్టింగ్ పెట్టి, ఆ పదివేలూ పోగొట్టుకోవడమే కాకుండా అనవసరమైన గొడవలో తలదూర్చి నానా కష్టాలూ అనుభవిస్తాడు.

అదే సినిమాలో చివరి సన్నివేశానికి వచ్చేసరికి పాతిక వేల రూపాయల ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకి వెళ్తున్న కొడుకు అల్లు అర్జున్‌ని "ఉద్యోగం వస్తే నెలకి ఎంతొస్తుంది..?" అని నాన్న తనికెళ్ళ అడుగుతాడు. "పాతిక వేలు" అని అని హీరో అల్లు సమాధానం ఇస్తాడు. "లక్షరూపాయలు సంపాదించడానికి ఎన్నాళ్ళు పడుతుంది..?" అని మళ్ళీ హీరో నాన్న అడుగుతాడు. "నాలుగు నెలలు" అని హీరో సమాధానం చెప్తాడు. "రెండు గంటల్లో లక్షొస్తే ఏమవుతుంది..?" అని మళ్ళీ తనికెళ్ళ ప్రశ్నిస్తాడు. "ప్రాబ్లమ్స్ వస్తాయి నాన్నా" అని అల్లు అర్జున్ సమాధానమిస్తాడు.

బెట్టింగులతో వచ్చే నష్టాన్ని, కష్టాన్ని వివరిస్తూ ఒక స్పష్టమైన సందేశం ఇస్తూ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ఈ సినిమాకి ముగింపు పలుకుతాడు.

ఎప్పుడో పన్నెండేళ్ళ క్రితం అంటే 2012లో ఈ సినిమా వచ్చింది.

అప్పటికీ ఇప్పటికీ పరిస్థితి ఇంకా అధ్వాన్నంగా మారింది. బెట్టింగ్ స్థాయి మారింది. వేలనుండి లక్షలలోకి, లక్షల నుండి కోట్లలోకి బెట్టింగ్ వ్యాపారం ఎగబాకింది. ఆ సినిమాలో హీరో పడిన బాధల లాంటి కష్టాలు పడకపోయినా ఆర్థికంగా మాత్రం తీవ్రంగా నష్టపోతున్నారు.

మొన్న జరిగిన ఎన్నికలలో ఎన్ని వేల కోట్లు చేతులు మారాయో లెక్కలేదు. ఎంతమంది తాము దాచుకున్న డబ్బులు పార్టీల గెలుపు ఓటములపై పెట్టి పోగొట్టుకున్నారో తెలీదు. ఈ లెక్కలు బయటకి రావు. ఎందుకంటే.. ఇది చట్ట విరుద్ధం. ఫలితాలకి ఒక్కరోజు ముందు కూడా వైసీపీ అధినాయకులు ప్రదర్శించిన మేకపోతు గాంభీర్యం, ఆ పార్టీ శ్రేణులు కల్పించిన భరోసాతో, ధైర్యంతో వాళ్ళ మాటలని నమ్ముకుని పార్టీ గెలుస్తోందని పందెం కాసి ఎంత మంది పార్టీ కార్యకర్తలు భయంకరంగా నష్టపోయారో చెప్పుకోలేని దుస్థితి.

కోట్లకు పడగలెత్తిన రాజకీయ నాయకులు, పార్టీలని అడ్డం పెట్టుకుని సంపాదించిన ఆ పార్టీ శ్రేణులు నష్టపోయినా పరవాలేదు.

అలా కాకుండా తాము కష్టపడి దాచుకున్న డబ్బుల్తో, ఇళ్ళల్లో కన్నతల్లి నగలో, కట్టుకున్న ఇల్లాలి తాళిబొట్టో కుదువబెట్టినవారు, తమ ఆస్తులు పణంగా పెట్టి తెలిసిన వారి దగ్గర అప్పుచేసిన వారు చాలామందే ఉన్నారు. వీళ్లంతా జగన్‌మోహన్‌రెడ్డి వ్యామోహంలో, వైసీపీ నేతల మాటల మాయలో పడి తమ బ్రతుకులు బజారు పాలు చేసుకున్నారు.

జరిగిన నష్టాన్ని పూడ్చుకోలేక, చేసిన ఘనకార్యాన్ని ఎవరికీ చెప్పుకోలేక, చాలామంది తమలో తామే కుమిలిపోతున్నారు. చావలేక బ్రతుకుతున్నారు.

వైసీపీని నమ్ముకుని మునిగిపోయిన వారి లెక్కలు బయటకి తీస్తే వారందరినీ ఓదార్చడానికి జగన్ మరో ఓదార్పు యాత్ర చేయాలి. ఆ యాత్ర ఐదేళ్ల పాటు జరిగినా ఆశ్చర్య పోనవసరంలేదు. బాధితుల సంఖ్య ఖచ్చితంగా ఆ స్థాయిలోనే ఉంటుంది. తాజాగా జరిగిన క్రికెట్ ప్రపంచ కప్ పోటీ ఫైనల్స్ రోజు కూడా దేశవ్యాప్తంగా సుమారు లక్ష కోట్లకి పైగా బెట్టింగ్ జరిగుంటుందని అంచనా.

ఈ తరహా వ్యాపారంచేసే "బుకీల" కీళ్లు విరచాలి. బెట్టింగ్ అనే పదం వింటేనే భయపడేలా ప్రత్యేక చట్టం తేవాలి. బెట్టింగ్ వల్ల జరిగే నష్టాలని వివరిస్తూ సదస్సులు జరపాలి. యువతను చైతన్యపరచి పందాల కారణంగా పతనమవుతున్న వారి భవిష్యత్తు విలువను వారికి తెలియపరచాలి. బెట్టింగ్లను ప్రోత్సహిస్తున్న రాజకీయ నాయకులని రాజకీయాల నుండి వెలివేయాలి. కాసులకి కక్కుర్తిపడి పందెం మాఫియా చేతిలో కీలుబొమ్మలుగా మారుతున్న అధికారులని విధులనుండి తొలగించాలి. ఇలా ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించకపోతే ఈ బెట్టింగ్ జాఢ్యం మరింత ముదిరి అత్యంత ప్రమాదకరమైన అసాంఘిక చర్యగా మారే ప్రమాదముంది!

- రాజశ్రీ

## అమరావతి అభివృద్ధికి నిధులు సేకరించాలి!

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

ఇటీవల విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రామోజీరావు సంస్మరణ సభ జరిగిన విషయం అందరికీ తెలిసిందే. ఆ సభలో రామోజీ కుమారుడు కిరణ్ అమరావతి అభివృద్ధి కోసం పదికోట్ల రూపాయల విరాళాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబుకి, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి అందించడం మంచి ఆలోచన. కిరణ్‌లాగా ఇప్పటికే చాలామంది అమరావతి పునర్నిర్మాణ పురోభివృద్ధి కోసం ఉడతా భక్తిగా తమ సాయం అందిస్తున్నారు. చంద్రబాబునాయుడు రాజధాని అభివృద్ధికోసం ఒక కమిటీని పెట్టి అందులో రాష్ట్రంలో, రాష్ట్రం బయట, విదేశాలలో ఉన్న ప్రముఖ పారిశ్రామిక వేత్తలని, సంఘసేవకులని సభ్యులుగా పెట్టాలని నా సూచన. "అమరావతి అభివృద్ధి నిధి"ని ఏర్పాటుచేసి ముఖ్యమంత్రి ఒక్క పిలుపు ఇస్తే... ఆంధ్రపై అభిమానంతో భూరి విరాళాలతో చాలామంది ముందుకొస్తారు. అయిదేళ్ళకి ఒకసారి జరిగే ఎన్నికల కోసం రాజకీయపార్టీలకి వందల కోట్ల రూపాయలు ఇచ్చేవారు ఉన్నారు. అలాంటివారిని శాశ్వతంగా నిలిచిపోయే రాజధాని అభివృద్ధి కోసం సహకరించమంటే తప్పక సహాయం అందిస్తారు. ఈ బృహత్ కార్యక్రమం కోసం ఒక ప్రణాళిక రూపొందించి, సహాయం చేయడానికి ముందుకొచ్చే వారికి సముచిత గౌరవం లభించేలా ఆలోచన చేస్తే తప్పక మంచి ప్రతిస్పందన లభిస్తుందని నేను భావిస్తున్నాను.

డాక్టర్. పి.ఎస్.రెడ్డి, బెంగుళూరు.

## అక్షర సత్యాలని ఆవిష్కరించారు!

గత వారం 'లాయర్' పత్రికలో వచ్చిన " ఒంటరితనమే ఓడించింది" వ్యాసంలో వైకాపా అరాచకాలను, వారి తప్పుడు ప్రవర్తనను చక్కగా వివరించారు. వారి పాలనకు నిలువెత్తు సాక్ష్యంగా ప్రస్ఫుటంగా విషయాలని విడమరిచారు.

వైకాపా కోటలు చూచి అవాక్కయ్యి, ఈవిషయాలు ఎన్నికలకు ముందే బయటికి పొక్కుంటే, జగన్ కోరుకున్నట్లుగా 175 సీట్లు కూటమికి వచ్చి ఉండేవని, తమ పార్టీకి గుండుసున్నాయే మిగిలుండేదని వైకాపా వాళ్ళు వాపోతున్నట్లు "అవాక్కయ్యారా" వ్యాసంలో పేర్కొన్న విషయం అక్షరసత్యం.

ఇంతకూ సకలశాఖామంత్రిగా, సూడో సీఎంగా వ్యవహరించిన సజ్జల ఏమైనట్లు? ఉలుకు పలుకు లేదే! సజ్జల రాగులలో మిళితమైపోయి కనుమరుగైనట్లున్నాడు...!

దువ్వూరు జనార్ధన్‌రెడ్డి - చికాగో, యు.ఎస్.ఏ.

## వెంకయ్యది విశిష్ట వ్యక్తిత్వం!

నెల్లూరీయులైన మాజీ ఉపరాష్ట్రపతివర్యులు వెంకయ్యనాయుడిది విశిష్టమైన వ్యక్తిత్వం. వారి నిగర్వతత్వం, హుందాతనం, ఎదిగే కొద్దీ ఒదిగే నైజం వారి ప్రతిభకి ఆభరణాలై, ఆయన అంతటి ఉన్నత స్థాయికి వెళ్ళేలా తోడ్పడ్డాయి. మన వెంకయ్యకి అమృతోత్సవ అభినందనలు.

– ప్రొ. సి.ఆర్.విశ్వేశ్వరరావు, హైదరాబాదు.

# లివర్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## ➤ గ్లెనిగల్స్ హెల్త్‌సిటీ లివర్ ప్లాంటేషన్ సీనియర్ సర్జన్ డాక్టర్ రజనీకాంత్



**శరీరంలో ఎంతో ముఖ్యమైన కాలేయానికి సంబంధించిన వ్యాధులు, సమస్యల నివారణలో ప్రపంచప్రఖ్యాతి గడించిన వైద్యుల్లో మన నెల్లూరీయులు కూడా ఉండడం సింహపురి సీమకు గర్వకారణం. ఆయన మరెవరో కాదు.. ఆత్మకూరు సమీపంలోని మురుగళ్ళ గ్రామానికి చెందిన డాక్టర్ రజనీకాంత్. చెన్నైలోని గ్లెనిగల్స్ హెల్త్‌సిటీలో ఆయన లివర్ స్పెషలిస్టుగా, సీనియర్ లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ సర్జన్‌గా ఉన్నారు. పుట్టినగడ్డపై అభిమానంతో నెలకోసారి నెల్లూరుకు వచ్చి కాలేయవ్యాధిగ్రస్తులకు తగు సలహాలు, సూచనలందిస్తూ, అవసరమైన వైద్యసేవలందిస్తున్నారు. ప్రపంచ కాలేయవ్యాధుల నివారణ మాసోత్సవాన్ని పురస్కరించుకుని, ఇటీవల నెల్లూరులోని గ్లెనిగల్స్ హెల్త్ క్లినిక్‌లో రోగులకు కాలేయవ్యాధుల పట్ల ఆయన అవగాహన కల్పించారు. అంతేకాదు, తాము చేసిన శస్త్రచికిత్సల ద్వారా కోలుకుంటున్న పలువురు రోగులను కూడా ఆయన ఈ సందర్భంగా పరిచయం చేశారు. కాలేయవ్యాధులు ఎందువల్ల వస్తాయి?.. ఎలా వాటిని గుర్తించాలి?..వాటి నివారణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో రోగులకు అర్థమయ్యేలా చెప్పారు. ఆ వివరాలను..ఆయన మాటల్లోనే తెలుసుకుందాం.**

శరీరంలో 'లివర్' (కాలేయం) ఎంతో ముఖ్యమైన పాత్రను పోషిస్తుంది. మనం తినే ఆహారాన్ని శుద్ధిచేసి శరీరంలోని అన్ని భాగాలకు పంపుతుంది. జీర్ణక్రియను సక్రమంగా ఉంచడం, రక్తప్రసరణ సరిగా ఉండేలా చూడడం, వ్యాధినిరోధక శక్తిని పెంపొందించడం వంటి దాదాపు 200 రకాల విధులను కాలేయం నిర్వర్తిస్తుంది. అందుకే, కాలేయం ఎంత బాగుంటే ఆరోగ్యం అంత బాగుంటుంది. కాలేయంలో కొవ్వుపదార్థాలు అధికంగా చేరితే కాలేయం దెబ్బతింటుంది. అందువల్ల, లివర్ పాడవకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తగా ఉండాలి.

### వ్యాధుల పట్ల అవగాహన ముఖ్యం :

లివర్ దెబ్బతినడానికి ముఖ్య కారణాల్లో మితిమీరిన మద్యపానం ఒకటి. కొన్ని రకాల వైరస్‌లు, పాశ్చాత్య ఆహారపు టలవాట్లు..అంటే ఫాస్ట్‌ఫుడ్స్..జంక్ ఫుడ్స్ వంటివి తినడం వల్ల కూడా లివర్ సమస్యలు వస్తుంటాయి. కలుషితమైన ఆహారం తినడం, కలుషిత నీరు తాగడం వంటివి ఇంకా ప్రమాదం. అందువల్ల కామెర్లు (జాండిస్) వంటి వ్యాధులు వస్తాయి. 'లివర్ క్యాన్సర్' వంటి ప్రాణాంతక వ్యాధులు కూడా పొంచి ఉంటాయి. కొన్ని రకాల లివర్ వ్యాధులు జన్యుపరంగా పుట్టుకనుంచే వస్తుంటాయి. కనుక, లివర్ వ్యాధుల పట్ల అవగాహనతో ఉండాలి. లివర్ ఆరోగ్యంగా ఉండడం పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ తీసుకుంటుండాలి.

### కాలేయ మార్పిడిపై అపోహలు వద్దు :

ఒకవేళ లివర్ గట్టిపడినట్లుగా ఉండి, ఇబ్బంది పెడుతున్నట్లుంటే అది లివర్‌కు సంబంధించిన సమస్య అని ప్రాథమిక స్థాయిలోనే గుర్తించవచ్చు. కామెర్లు రావడం, కడుపులో నీరుచేరినట్లుండడం, రక్తం గడ్డకట్టకపోవడం, వ్యాధినిరోధకశక్తి తగ్గడం వంటివన్నీ వ్యాధి లక్షణాలుగా గుర్తించవచ్చు. మందులు మాత్రలతో తగ్గకపోతే, శస్త్ర చికిత్స కూడా చేయించుకోవచ్చు. లివర్‌కు సంబంధించి ఏదైనా సమస్యలు వచ్చినా, అవసరమైతే శస్త్రచికిత్సల ద్వారా కాలేయాన్ని బాగుచేసుకోవచ్చు. కాలేయం మార్పిడిపై ఎలాంటి అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదు. శస్త్ర చికిత్సలని భయపడాల్సిన పనిలేదు. బ్రెయిన్‌డెడ్ అయిన వారినుంచి కానీ, లేదా ఒకే గ్రూపు రక్తం కలిగిన రోగి కుటుంబ సభ్యుల నుంచి కానీ సగభాగం కాలేయం మాత్రమే తీసుకుని శస్త్రచికిత్సల ద్వారా ఆ వ్యాధిని నయం చేసుకోవచ్చు. అలా చేసినప్పుడు కాలేయం ఇచ్చినవారికి కానీ, రోగి ఆరోగ్యానికి గానీ ఎలాంటి సమస్య ఉండదు. ఇప్పటికే నెల్లూరులో సుమారు 25 మంది కాలేయ వ్యాధిగ్రస్తులకు మేం విజయవంతంగా శస్త్రచికిత్సలు చేసి ఉన్నాం. చిన్నవయసున్న వారికి కూడా అవసరమైతే కాలేయ మార్పిడి చేయవచ్చు. తద్వారా వారు ఆరోగ్యంగా ఉండేలా చూడవచ్చు.. అని డాక్టర్ రజనీకాంత్ చెప్పారు. ఈ సందర్భంగా చెన్నైలోని తమ ఆసుపత్రిలో లివర్ మార్పిడి చేయించుకుని ఆరోగ్యంగా ఉంటున్న లక్ష్మీరెడ్డి, శేషారెడ్డి, రక్షితలతో మాట్లాడించారు. కాలేయ మార్పిడి శస్త్రచికిత్సల వల్ల తాము ఆరోగ్యంగా ఉన్నామని డాక్టర్ రజనీకాంత్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## అమరావతి రైతులకు ఘన స్వాగతం



మండల కేంద్రమైన ఉలవపాడులో ఈనెల 2న అమరావతి రైతులకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటై ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు పదవినధిష్టించడంతో అమరావతి రాష్ట్రరాజధాని కావడం ఖాయమంటూ అమరావతి రైతులు తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామికి మొక్కులు తీర్చుకునేందుకు పాదయాత్రగా బయలుదేరారు. ఈ యాత్రలో భాగంగా 30 మంది రైతులు ఉలవపాడు వద్దకు రాగానే స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పెద్దసంఖ్యలో అభిమానులు ఆ రైతుల బృందానికి జేజేలు కొడుతూ స్వాగతం పలికారు. అమరావతి రైతులకు తమ సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో, చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రానికి అమరావతి రాజధానిగా ఏర్పడడం తథ్యమని అన్నారు. ఇంత కాలంగా తాము చేసిన ఉద్యమాలకు, పోరాటాలకు ఫలితం లభించిందని, తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో తమ కోరిక నెరవేరబోతోందని వారు సంతోషం వ్యక్తం చేశారు. తమ పట్ల ప్రజలు చూపుతున్న అభిమానానికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఉలవపాడు మండల అధ్యక్షుడు ఆర్ సుబ్బారావు, కందుకూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు మల్లేశ్వరరావు, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు ప్రభావతి పాల్గొన్నారు.

## క్యాన్సర్‌పై ఉపన్యాసం



నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (వివిఎస్‌యు)లోని బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 1న అమెరికాలోని జార్జియాకి చెందిన ప్రఖ్యాత బోహేరింగెర్ ఇంగ్లేహీమ్ ఇండస్ట్రీలో శాస్త్రవేత్తగా పనిచేస్తున్న డా. కె. హేమంత్‌కుమార్ ప్యాంక్రియాటిక్ క్యాన్సర్‌పై ఉపన్యసించారు. ప్యాంక్రియాటిక్ క్యాన్సర్‌లో వచ్చే జన్యు పాత్రపై మార్పులను విపులంగా వివరించారు. ఆమేరకు తాను చేసిన పరిశోధనలను వివరించారు. ఈ కార్యక్రమాన్ని విఎస్‌యు సీనియర్ అధ్యాపకులు ఆచార్య జి విజయానందకుమార్‌బాబు ప్రారంభించగా, ఆచార్య జి.విజయ్, డా. ఉదయ్‌శంకర్, డా. కిరణ్మయి, డా. ఎ.ప్రవీణ్ కుమార్, డా వి. అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## మంచినీటి సమస్యలు తీరుస్తా

### - పొదలకూరు మండల ప్రజలకు ఎమ్మెల్యే సోమిరెడ్డి హామీ

పొదలకూరు మండలంలో ఎంతోకాలంగా ప్రజలు మంచినీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, ఆ సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. ఈనెల 2న ఆయన పొదలకూరులోని కెఆర్‌నగర్‌లో ఉన్న శ్రీ ప్రసన్న పోలేరమ్మ అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మహిళలతో మాట్లాడి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఇక్కడి ప్రజలు ఎన్నికల్లో తన గెలుపుకోసం అమ్మవారికి మొక్కుకున్నారని, అమ్మవారి అనుగ్రహంతో తాను గెలిచాక ఆ మొక్కులు తీర్చుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. గత ప్రభుత్వం ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేసిందని, కండలేరు ప్రాజెక్టుకు సంబంధించి దక్షిణ కాలువ పనులు నేటికీ అసంపూర్తిగానే ఉన్నాయని, వాటన్నిటినీ పరిశీలించి అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని చెప్పారు. కండలేరు లిఫ్ట్ ఇరిగేషన్ కరెంటు బిల్లుల విషయం కూడా పరిశీలించి, తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట టీడీపీ నాయకులు తలచీరు మస్తాన్‌బాబు, మల్లికార్జున్‌నాయుడు, బొమ్మి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న 'శ్రీకృష్ణ కథామృతం'



పద్యసారస్వత పరిషత్-నెల్లూరు శాఖవారు స్థానిక బాలాజీనగర్‌లోని శ్రీ సీతారామ స్వామి మందిరంలో నిర్వహిస్తున్న 'శ్రీకృష్ణ కథామృతం" భాగవత సప్తాహం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఏడవరోజు ఈనెల 2న 'రుక్మిణీ కళ్యాణం' అనే అంశంపై ప్రముఖ పద్యకవి పోలవరపు లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ, 'శ్రీకృష్ణునికి రుక్మిణి పంపిన సందేశం ప్రేమ సందేశం కాదని, అది భక్తురాలిగా ఆమె పంపిన భక్తి నివేదన' అని అన్నారు. రుక్మిణీ కళ్యాణంలోని ధార్మికత్వాన్ని, పారమార్థిక దృష్టిని ఆయన విశ్లేషణాత్మకంగా తెలియజేశారు. సభకు పద్యకళాపరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్ర ప్రసాద్ అధ్యక్షత వహించగా, డా. చీమకుర్తి వెంకటేశ్వరరావు సభా కార్యక్రమాన్ని నిర్వహించారు. భట్టారం సుబ్బు శ్రీనివాస్, మాధవి సభాపోషకులుగా వ్యవహరించారు. ప్రపంచ తెలుగు సమాఖ్య నెల్లూరు రీజియన్ కన్వీనర్ నలుబోలు బలరామయ్యనాయుడు, విద్వాన్ అగస్త్యరాజు సుబ్బారావు, సూరం చంద్రశేఖరం, అవధాని కోట రాజశేఖర్, చక్కిరాల జయప్రసాద్, కోట శ్రీరామమూర్తి, తంగిరాల నరసింహకుమార్, శ్రీ సమయానందనాథ స్వామీజీ, దేవరకొండ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 'సాహిత్యంలో చమత్కారం'పై.. ఆకట్టుకున్న ప్రసంగం



చెన్నైలోని వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఇటీవల టీనగర్‌లోని ఆంధ్రాక్లబ్ హాలులో 'సాహిత్యం- చమత్కార వైభవం' అనే అంశంపై జరిగిన సాహిత్యోపన్యాసం అందరినీ ఆకట్టుకుంది. ముంబైకి చెందిన ప్రముఖ సారస్వతోపన్యాసకులు సాంప్రతి సురేంద్రనాథ్ పాల్గొని సాహిత్యంలో చమత్కారాలపై సోదాహరణలతో సహా వివరించారు. శ్రోతలను ఆకట్టుకునేందుకు చమత్కారం ప్రధానపాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు. అనంతరం, వేద విజ్ఞాన వేదిక సంస్థ కార్యదర్శి కందనూరు మధు, అధ్యక్షుడు జేకెరెడ్డి కుమారుడు విజయ్‌రెడ్డి ఆయన్ను ఘనంగా సన్మానించారు. పెద్దసంఖ్యలో సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

### ఎంపీ వేమిరెడ్డి, మంత్రి నారాయణల చేతులమీదుగా..

# పండుగలా.. పింఛన్ల పంపిణీ

**సంతోషం వ్యక్తం చేస్తూ.. సీఎం చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన లబ్ధిదారులు**

జిల్లాలో పింఛన్ల పంపిణీ ఈనెల 1న అట్టహాసంగా ప్రారంభమైంది. ఉదయం 6గంటల నుంచే పింఛనుదారుల ఇళ్ల వద్దకే పింఛన్లు రావడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నెల్లూరుసిటీ పరిధిలోని యల మలవారిదిన్నెలో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. ఇంటి వద్దకే వెళ్లి పెరిగిన పెన్షన్ మొత్తాన్ని లబ్ధిదారులకు అందించారు. వృద్ధులకు, వితంతువులకు 4000 రూపాయలతో పాటు ఏప్రిల్, మే, జూన్ నెలకి సంబంధించిన 3000 రూపాయలు మొత్తం కలిపి 7వేల రూపాయలను అందించడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా, దివ్యాంగులకు రూ. 6000 పెన్షన్ అందించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాళ్ళపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి, టిడిపి నేతలు పాల్గొన్నారు.



### దివ్యాంగుల పట్ల..

## వాత్సల్యం చాటుకున్న వేమిరెడ్డి దంపతులు

- ప్రగతి ఛారిటీస్ సంస్థకు రూ. 3 లక్షల విరాళం
- గులాబీపూలతో కృతజ్ఞతలు తెలిపిన చిన్నారులు



నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, అపర దానకర్ణులు, మానవీయ మూర్తులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి..కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు ప్రతి ఏడాది వలెనే ఈసారి కూడా మానసిక వికలాంగులపట్ల తమకున్న వాత్సల్యాన్ని చాటుకున్నారు. మానసిక వికలాంగులైన ఎందరో చిన్నారులకు ఆశ్రయమిచ్చి, వారి ఆలనాపాలనా చూస్తున్న నెల్లూరులోని ప్రగతి ఛారిటీస్ సంస్థకు ఇటీవల వేమిరెడ్డి దంపతులు రూ.3 లక్షల విరాళం అందించి ఆదుకున్నారు. ఛారిటీస్ ఇన్‌ఛార్జి సుబాష్, పలువురు చిన్నారులతో కలిసి నెల్లూరులోని విపిఆర్ నివాసంలో వారివద్ద నుంచి చెక్కును అందుకున్నారు. అనంతరం సుబాష్ మాట్లాడుతూ, విపిఆర్ దంపతులు ఏటా ప్రగతి ఛారిటీస్ నిర్వహణకు 2012 నుంచి ప్రతి ఏటా 3 లక్షల రూపాయలు విరాళంగా అందించి ఆ చిన్నారుల భవితకు చేయూతనందిస్తున్నారని తెలిపారు. ప్రగతి ఛారిటీస్ ద్వారా మూగ, చెవుడు తదితర సమస్యలున్న చిన్నారులకు అర్థమయ్యేవిధంగా విద్యను బోధిస్తున్నామన్నారు. మానసిక వికలాంగులను కూడా చేరదీసి వారికి ఆశ్రయం కల్పించామన్నారు. అలాంటి చిన్నారులున్న ప్రగతి ఛారిటీస్‌కు విపిఆర్ దంపతుల ఔదార్యం మరువ లేనిదని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు వేమిరెడ్డి దంపతులకు గులాబీ పూలు అందించి కృతజ్ఞతలు తెలియజేశారు.

## పాన్ బ్రోకర్స్ కొత్త కార్యవర్గం

నెల్లూరు రంగనాయకులపేటలో ఇటీవల జరిగిన నెల్లూరు ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అండ్ పాన్ బ్రోకర్స్ అసోసియేషన్ కార్యవర్గం ప్రమాణస్వీకారోత్సవంలో మంత్రి నారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అసోసియేషన్ అధ్యక్షులుగా ఎంపికైన శోభన్‌బాబును, కార్యవర్గసభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి నారాయణ మాట్లాడుతూ, వైసిపి అరాచక, అవగాహన లేని పాలనతో రాష్ట్రంలో ఆదాయ వనరులు లేకుండా చేసి ఖజానాను ఖాళీ చేసిందని, రాష్ట్ర అభివృద్ధి జరగాలంటే ఆదాయ వనరులు పుష్కలంగా ఉండాలన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ వనరులు సమకూర్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించామని తెలిపారు.

## వైభవంగా.. శ్రీ మహావిష్ణు బ్రహ్మోత్సవాలు



నెల్లూరు వేదాయపాళెంలోని శ్రీ అయ్యప్పదేవస్థానంలో వేంచేసియున్న శ్రీ మహాలక్ష్మి గోదా సమేత శ్రీ గురువాయూర్ మహావిష్ణుస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం నేత్రపర్వంగా జరిగిన పుష్పయాగంతో ముగిశాయి. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పాంచరాత్ర ఆగమం ప్రకారం భద్రాచలం శ్రీ సీతారామస్వామి వారి దేవస్థానం స్థానాచార్యులు కొమాండూరు ఇలైవల్లి తలసాయిస్వామి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. సాయంత్రం మహాపూర్ణాహుతి, ధ్వజావరోహణం, శ్రీ పుష్ప యాగం, మహా కుంభ ప్రోక్షణ, శ్రీవారి ఏకాంత సేవ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఆలయ ఛైర్మెన్ గూడల శేషగిరిరావు, కార్యదర్శి వెంకటరత్నం, కోశాధికారి రత్నయ్య, కేజీ శంకర్, మోహన్‌రావు తదితరుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి.

## తొలి జర్నలిస్టు..నారదుడే!




దేవర్షి నారద జయంతిని పురస్కరించుకుని ఇటీవల నెల్లూరులో పలువురు జర్నలిస్టులకు సన్మానాలు జరిగాయి. స్థానిక 'సాహితీ సుధ ఫౌండేషన్' వారి ఆధ్వర్యంలో, నగరంలోని క్లాత్‌మర్చంట్స్ అసోసియేషన్ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులను సన్మానించారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంతీయ సంచాలక్ బయ్యా శ్రీనివాసులు మాట్లాడుతూ, నారదమహర్షి వైశిష్ట్యాన్ని వివరించారు. నారదుడు కలహభోజుడు కాదని, పురాణకాలంలో ముల్లోకాలు తిరుగుతూ లోకకల్యాణార్థం సమాచారం తెలియజెప్పి ధర్మం కోసం నిలచిన మహనీయుడు నారదుడని ఆయన కొనియాడారు. నాటికాలంలో నారదులవారే తొలి జర్నలిస్టు అని, నేటి పాత్రికేయ సమాజానికి నారద మహర్షి ఆదర్శనీయులని అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు నాగారెడ్డి హరిచంద్రారెడ్డి, సాయి డిజిటల్ నెట్‌వర్క్ సీఈఓ చుండూరు సాయి వెంకటసత్యనారాయణ, నెల్లూరు డివిజన్ పోస్టల్ సూప రింటెండెంట్ కాకర్ల శ్రీనివాస్, విక్రమకుమార్‌జైన్, సుజని, శిరీష, నరేష్‌కుమార్, ఉదయ్‌కుమార్, మనోహర్, కేవీ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



## వెంకయ్యకు.. పుట్టినరోజు శుభాకాంక్షలు

భారత పూర్వ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు జన్మదినోత్సవం సందర్భంగా ఏపీ బీజేపీ రాష్ట్ర మోర్చాల సమన్వయకర్త పి.సురేంద్రరెడ్డి హైదరాబాద్‌లోని వెంకయ్య నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వెంకయ్యకు 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జరిగిన అభినందన సభలో వారి ప్రజాసేవ జీవిత విశేషాలపై ప్రచురించిన 'వెంకయ్య నాయుడు ఏ లైఫ్ ఇన్ సర్వీస్" ఏ బయోగ్రఫీ ఆఫ్ కరేజ్, కమిట్మెంట్ & క్యాలిబర్ అనే పుస్తకాన్ని భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ వర్చువల్‌గా ఆవిష్కరించారు. వెంకయ్యనాయుడు ఆ పుస్తకంపై తన సంతకం చేసి సురేంద్రరెడ్డికి అభిమానంతో ఇవ్వడం విశేషం.

## ప్రత్యేకహోదా సాధించాలి

అస్తవ్యస్త పాలనతో ఇంతకాలం అవస్తలతో ఉన్న రాష్ట్రానికి ఇకనైనా ప్రత్యేకహోదాను సాధించాలని నెల్లూరులోని సీపీఐ నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్ కోరారు. ఈనెల 2న స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర విభజన జరిగి పదేళ్ళయినా కేంద్రం రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వలేదని, ప్రత్యేక హోదా సాధిస్తామని గత ముఖ్యమంత్రి బీరాలు పలికినా ఆచరణలోకి రాలేదని ఆయన విమర్శించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వమైనా దీనిపై దృష్టిసారించి ప్రత్యేకహోదా సాధించాలన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షానవాజ్, పలువురు సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

## పండరిభజనల గురువు.. లక్ష్మీసాయికి సన్మానం



నెల్లూరుజిల్లాలోని ప్రముఖ పండరి భజనల గురువు లక్ష్మీసాయికి ఇటీవల నగరంలోని టౌన్‌హాలులో ఘన సన్మానం జరిగింది. సృజన సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన శాస్త్రీయ నృత్యప్రభంజనం కార్యక్రమంలో భాగంగా, ఆమెను అభినందించి సత్కరించారు. జిల్లావ్యాప్తంగా సుమారు 5 వందల మందికి పండరిభజనలు, కోలాటాలను ఉచితంగా నేర్పించారంటూ ఆమె సేవలను వక్తలు కొనియాడారు. స్థానిక పద్మావతినగర్‌లోని సాయిబాబా అద్దాల మందిరంలో తొలి మహిళా పండరిభజన, కోలాటం గురువుగా ఖ్యాతి చెందిన లక్ష్మీసాయితో పాటు, నృత్యగురువులు సురభి గాయత్రి, వి.సంధ్యా శేఖర్, పి.కల్పన, కె.బాలమ్మ, మీనాక్షి, జ్యోతి, వి.వైష్ణవిలను సన్మానిం చారు. సాయిదర్బార్ అద్దాలమందిరం వ్యవస్థాపక ధర్మకర్త మధుసాయి, పాదర్తి బాలాజీ, సాయిదర్బార్ సత్సంగ్ సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.



# ఆత్మకూరును అభివృద్ధిలో అగ్రగామిని చేయాలి

## - మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



ఆత్మకూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని, అభివృద్ధిలో అగ్రగామిని చేయాలని, అందుకు తగ్గ ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈనెల 2న ఆయన ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పదేళ్ల క్రితం ఆత్మకూరు నూతన రెవిన్యూ డివిజన్‌గా ఏర్పడినప్పటికీ, ఇంకా ఆ స్థాయి అభివృద్ధికి నోచుకోకపోవడం విచారకరమన్నారు. ఆత్మకూరును మున్సిపాలిటీగా అప్ గ్రేడ్ చేసినప్పుడు భవిష్యత్తు అవసరాల దృష్ట్యా రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా వంద కోట్ల రూపాయల వ్యయంతో రక్షిత మంచి నీటి వసతి సౌకర్యాలు కల్పించామన్నారు. అయినప్పటికీ బాలికల గురుకుల పాఠశాల, పాలిటెక్నిక్ కాలేజీ వంటి ప్రభుత్వ సంస్థలకు త్రాగునీటి సౌకర్యం కల్పించకపోవడం మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు కలసికట్టుగా పనిచేసి నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. జిల్లాలో వర్షాల సీజన్ రాబోతున్నందున చెరువులు, కాలువల్లో పూడికతీత, గుర్రపు డెక్క తొలగింపు వంటి మరమ్మతు పనులను సత్వరం పూర్తి చేసి రైతాంగానికి అండగా నిలవాలని ఆయన అధికారులను ఆదేశించారు.

### కాలేజీలో మంచినీటి వసతికి మంత్రి ఆదేశం :

తొలుత మంత్రి, ఆత్మకూరులోని పాలిటెక్నిక్ కాలేజీ, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్ అతిథి గృహాలను సందర్శించారు. కాలేజీలో మంచినీటి వసతి లేదంటూ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు మంత్రి దృష్టికి తీసుకురాగా, వెంటనే కళాశాలలో త్రాగునీటి సౌకర్యం కల్పించాల్సిందిగా మున్సిపల్ కమిషనర్ ఫజీుల్లాను మంత్రి ఆదేశించారు. రెండు వారాల్లో ఆ పని పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అదేవిధంగా శిథిలావస్థలో ఉన్న పంచాయతీ రాజ్ అతిథి గృహాన్ని తొలగించి ఆధునిక వసతులతో నూతన నిర్మాణానికి తగు ప్రతిపాదనలు తయారుచేయాలని మంత్రి అధికారులకు సూచించారు. ఆత్మకూరు ఆర్‌డిఓ మధులత, మాజీ శాసనసభ్యులు కొమ్మి లక్ష్మయ్యనాయుడు, టిడిపి నాయకులు ధనుంజయరెడ్డి, ఇరిగేషన్ ఎస్ఇ కృష్ణ మోహన్, ఆర్ అండ్ బి ఎస్ఇ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



## సీఎం చంద్రబాబు చిత్రపటానికి..

# పింఛనుదారుల పాలాభిషేకం

జులై 1వతేదీ వృద్ధులకు, వితంతువులకు ఫింఛనుగా రూ. 7వేలు, దివ్యాంగులకు రూ. 6 వేలు వంతున రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించడంతో పింఛనుదారుల్లో హర్షాతిరేకాలు వెల్లడయ్యాయి. నెల్లూరు సిటీ నియోజకవర్గం వెంకటేశ్వరపురంలోని జనార్ధన్‌రెడ్డి కాలనీలో మాజీ కార్పొరేటర్ జహీర్ ఆధ్వర్యంలో, అందుకు కృతజ్ఞతగా సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిలు పాల్గొని లబ్ధిదారుల చేత సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేయించారు. స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఆస్ట్రేలియా హై-కమిషనర్‌తో.. ఎంపీ వేమిరెడ్డి



నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) ఇటీవల డిల్లీలో ఆస్ట్రేలియా హై-కమిషనర్ ఫిలిప్ గ్రీన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కొద్దిసేపు ముచ్చటించారు. ఢిల్లీలోని ఆస్ట్రేలియన్ హై కమిషనర్ ఆధ్వర్యంలో పలువురు ఎంపీలతో కలసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆయనకు పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. అనంతరం విపిఆర్ ఆయనతో కలిసి పలు అంశాలపై చర్చించారు.

# ప్రజాసంక్షేమం - రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

## - కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



రాష్ట్ర ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి రెండూ సీఎం చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. ఈనెల 1న పింఛన్ల పంపిణీ సందర్భంగా ఆమె ఇందుకూరుపేట మండలం డేవిస్‌పేట ఎస్టీకాలనీలో లబ్దిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం పండుగ వాతావరణాన్ని తలపించింది. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చేతుల మీదుగా పలువురు వయోవృద్ధులు, దివ్యాంగులు ప్రభుత్వం కేటాయించిన పింఛన్లను అందుకుని ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ, పింఛన్లు అందుకున్న లబ్దిదారులు తమపట్ల చూపుతున్న అభిమానం, వారి కళ్ళల్లో ఆనందం చూస్తుంటే విజయోత్సవ సభను తలపిస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తం మీద ఒకేరోజు 65లక్షల 18వేల 496 మందికి దాదాపు 4,500 కోట్ల రూపాయలను పింఛన్లుగా అందించిన ఘనత ఒక్క ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. సంక్షేమంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపగలిగిన సమర్థత చంద్రబాబుకే ఉందని కొనియాడారు. ఇందుకూరుపేట మండల అధ్యక్షులు వీరేంద్రనాయుడు, సీనియర్ టిడిపి నాయకులు జెట్టి రాజగోపాల్ రెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, మదన్‌రెడ్డి, పున్నూరు కోశోర్‌బాబు, దేవిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పిఎల్ రావు తదితరులు పాల్గొన్నారు. తొలుత కోవూరు నియోజకవర్గం బుచ్చిరెడ్డిపాళెం ఖాజానగర్‌లో జూన్ 1న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రారంభించారు. నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి లబ్దిదారులకు ఆమె పింఛన్లు అందజేశారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛనును రూ. 4వేలకు పెంచిన సీఎం చంద్రబాబుకు లబ్దిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

# అడ్డదారితో ప్రమాదం

## స్కూల్ బస్సును ఢీకొన్న లారీ
## 29 మంది చిన్నారులకు గాయాలు






అడ్డదారి ప్రమాదానికి దారితీసింది. అటు స్కూల్‌యాజమాన్యం నిర్లక్ష్యం, ఇటు అధికారుల అలసత్వం కారణంగా ఓ స్కూల్‌బస్సు రోడ్డు ప్రమాదానికి గురైంది. ఆ వాహనంలోని క్లీనర్ మృతి చెందగా, అనేకమంది చిన్నారులకు గాయాలపాలయ్యారు. ఈనెల 2న కావలి సమీపంలోని ముసునూరు టోల్‌ప్లాజా వద్ద ఈ దుర్ఘటన జరిగింది. వివరాలిలా ఉన్నాయి. జాతీయ రహదారిపై ఉన్న డివైడర్‌ను దాటుతున్న సమయంలో ఆ స్కూల్‌బస్సును లారీ ఢీకొనడంతో, బస్సు బోల్తాపడింది. బస్సు క్లీనర్ చినకొండయ్య (65) అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. ఈ హఠాత్పరిణామంతో బస్సులో ఉన్న చిన్నారులు భయంతో కేకలు పెట్టారు. ఆ విషయం తెలిసి చిన్నారుల తల్లితండ్రులు ఎంతో ఆందోళనతో హుటాహుటిన ప్రమాదం జరిగిన ప్రాంతానికి తరలివచ్చారు. రక్త గాయాలతో రోదిస్తున్న బిడ్డలను చూసి తల్లడిల్లిపోయారు. ఈ సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తదితరులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. గాయాలపాలైన చిన్నారులను ఆసుపత్రులకు తరలించారు. కావలి నుంచి వస్తున్న ఆ బస్సులోని విద్యార్థులంతా కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి చెందిన ఆర్ఎస్ఆర్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదువుకుంటున్నవారే. టోల్‌గేటు దాటిన తర్వాత స్కూల్‌లోకి వెళ్తున్న బస్సును ఆ మలుపు వద్ద లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందంటున్నారు. బాధితులైన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ఓదార్చారు. మృతి చెందిన క్లీనర్ కుటుంబానికి రూ. 50వేలు సాయంగా అందజేస్తున్నట్లు ప్రకటించారు. జాతీయరహదారిపై ఉన్న డివైడర్లను అనధికారికంగా తొలగించడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని, స్కూల్‌కు దగ్గరిదారి అని అక్కడున్న డివైడర్లను తొలగించి, అడ్డదారిలో వెళ్లడం ప్రమాదానికి కారణమై ఉండొచ్చని సమాచారం. ఇలా అనధికారికంగా జాతీయ రహదారి మీద ఉన్న డివైడర్లను తొలగించడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం ఏమిటని స్థానికులు విమర్శిస్తున్నారు.




# కోటమ్మతల్లి ఆలయంలో.. విపిఆర్ దంపతులు



గూడూరు నియోజకవర్గం కోట మండల కేంద్రంలోని కోటమ్మ అమ్మవారిని విపిఆర్ దంపతులు ఇటీవల దర్శించుకున్నారు. తొలుత, ఆలయానికి చేరుకున్న వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఆయన సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలను ఆలయ అర్చకులు పూర్ణకుభంతో స్వాగతం పలికారు. అమ్మవారి గుడిలో విశేష పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందచేశారు. వేమిరెడ్డి దంపతులతో పాటు నాయకులు నల్లపురెడ్డి జగన్మోహన్‌రెడ్డి, దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, బెజవాడ వంశీరెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, అడపాల శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొని, అమ్మవారిని దర్శించుకొని ఆశీర్వచనాలు అందుకున్నారు.

### ఎన్‌బికెఆర్‌లో ఉత్సాహంగా...

# ఎన్‌సిసి శిక్షణా శిబిరం



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో కొద్దిరోజుల క్రితం 639 మంది క్యాడెట్లతో ప్రారంభమైన వార్షిక శిక్షణ శిబిరం ఇటీవల ముగిసింది. క్యాంప్ కమాండెంట్‌గా కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గోదాం గవే, డెప్యూటీ క్యాంప్ కమాండెంట్‌గా లెఫ్టినెంట్ కర్నల్ దీపక్ శర్మ వ్యవహరించారు. ఈ సందర్భంగా క్యాంప్ కమాండెంట్ గణేష్ గోదాం గవే మాట్లాడుతూ, సామాజికాభివృద్ధికి, విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి ఇలాంటి క్యాంపులు అవసరమన్నారు. విద్యార్థులను అయిదు బృందాలుగా విభజించి పోటీలను నిర్వహించారు. అసోసియేట్ ఎన్‌సిసి ఆఫీసర్ లక్ష్మీనారాయణ, పి.ఐ. సూరజ్ భాగేల్ నాయకత్వం వహించిన చార్లీ గ్రూప్‌కు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ లభించింది. మిగిలిన నాలుగు విభాగాలలో నలుగురు బెస్ట్ క్యాడెట్ అవార్డు విజేతలుగా నిలిచారు. వీరిలో జూనియర్ డివిజన్‌లో విజివి గౌతమ్ జ్ఞానేశ్వర్ రెడ్డి( జడ్పి పిహెచ్ఎస్–మెట్టు), జూనియర్ విభాగంలో దివ్యశ్రీ(అంబర్‌వుడ్–నెల్లూరు), సీనియర్ విభాగంలో పిఓ క్యాడెట్ ఎన్.వెంకటేశ్వర్లు (వివేకానంద కాలేజ్–నెల్లూరు), సీనియర్ విభాగంలో క్యాడెట్ ఎం.కావ్య (ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి – విద్యానగర్) విజేతలుగా నిలిచారు. ఈ విద్యార్థులందరికీ కమాండింగ్ ఆఫీసర్ చేతులమీదుగా పతకాలను బహుకరించారు. కళాశాల సంచాలకులు డాక్టర్ వి.విజయ్‌కుమార్‌రెడ్డి,సబ్ లెఫ్టినెంట్ వి.మల్లికార్జునరెడ్డి, ఎన్‌సిసి సెకండ్ ఆఫీసర్లు గుండాల నరేంద్రబాబు, సి.వి.నాగరాజు, థర్డ్ ఆఫీసర్లు పెంచలయ్య, మస్తానయ్య, టి.కొండారెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# క్రీడా రంగంలో ప్రతిఒక్కరూ రాణించాలి

### ఎమ్మెల్యే సునీల్‌కుమార్



క్రీడా రంగంలో ప్రతిఒక్కరూ రాణించాలని, క్రీడలతో సమాజంలో గుర్తింపు, గౌరవంతో పాటు ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో అల్లూరు ఆదిశేషారెడ్డి జయంతి సందర్భంగా స్పోర్ట్స్‌మీట్‌ను ఇటీవల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్‌కుమార్ మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించి, క్రీడాకారులకు వసతులు కల్పించేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు రామకృష్ణస్వరూప్, డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, జానకిరామిరెడ్డి, దశరథ రామిరెడ్డి, కె.మునిగిరీష్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన చట్టాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలి

### గూడూరు డిఎస్పీ సూర్యనారాయణరెడ్డి



మహిళల భద్రతకు మరిన్ని పదునైన నూతన చట్టాలు అమలులోకి వచ్చాయని, నూతన చట్టాల పట్ల ప్రజలు అవగాహన పెంచుకోవాలని గూడూరు డిఎస్పీ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. బ్రిటిష్ కాలం నాటి చట్టాలు దేశంలో అమలులో ఉండడంతో కేంద్ర ప్రభుత్వం వాటి స్థానాల్లో నూతన చట్టాలను ప్రవేశపెట్టి, జూలై 1వ తేదీ నుండి దేశవ్యాప్తంగా అమలులోకి తెచ్చింది. దీంతో నూతన చట్టాలపై అవగాహన కల్పిస్తూ పోలీస్ శాఖ అధికారులు గూడూరు పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్ వద్ద ప్రజలకు కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా గూడూరు డిఎస్పీ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ నూతన చట్టాల ద్వారా నిర్ణీత కాలంలో బాధితులకు కోర్టులలో న్యాయం జరుగుతుందని, తప్పుడు కేసులు పెట్టే వారిపై కూడా చర్యలు తీసుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు నూతన చట్టాలపై అవగాహన కలిగి సక్రమంగా నడుచుకోవాలని సూచించారు. సిఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పదవిని బాధ్యతగా నెరవేర్చా

### - మయూరి శ్యాంయాదవ్ -



గూడూరు పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో మౌలిక సదుపాయాలు, ప్రయాణీకుల వసతుల కల్పన కోసం పనిచేయడం ఎంతో ఆనందంగా ఉందని మాజీ డిఆర్‌యుసిసి మెంబర్ మయూరి శ్యాంయాదవ్ పేర్కొన్నారు. సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో డిఆర్‌యుసిసి మెంబర్‌గా తన నాలుగు సంవత్సరాల పదవీ కాలం జూలై 30తో ముగిసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నాలుగు సంవత్సరాలలో రైల్వేస్టేషన్‌లోని ప్రధాన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడం జరిగిందన్నారు. దీనికి సహకరించిన రైల్వే డిఆర్‌ఎం ఉన్నతాధికారులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# పర్యావరణ పరిక్షణే లక్ష్యం



పర్యావరణ పరిరక్షణలో భాగంగా తాము మొక్కలు నాటుతున్నామని ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు, పట్టణ ప్రముఖ డాక్టర్ సి.రోహిణి తెలిపారు. గూడూరు పట్టణంలోని సరస్వతి శిశు మందిరం ప్రాంగణంలో ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాము పర్యావరణ పరిరక్షణలో భాగంగా పట్టణ పరిధిలో అనేక ప్రాంతాల్లో మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



### మహానగరాల తరహా రెస్టారెంటుని.. నెల్లూరీయులకి పరిచయం చేసిన

# ‘మయూరి’ సుబ్బారావు.. ఇక లేరు!

***ఆతిథ్య రంగంలో నెల్లూరుజిల్లాలో ప్రసిద్ధిచెందిన వీరిశెట్టి కుటుంబంలో విషాదం చోటు చేసుకుంది. నెల్లూరుజిల్లా వాసులకి ఆధునిక వసతులతో, అధునాతన పరికరాలతో రుచికరమైన వంటలని పరిచయం చేసిన ‘మయూరి సుబ్బారావు’(62) కన్నుమూశారు. జూన్ 29న నెల్లూరు రమేష్‌రెడ్డినగర్‌లోని తమ నివాసంలో ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయన గత కొంతకాలంగా క్యాన్సర్ మహమ్మారితో పోరాడుతున్నారు. చివరికి మృత్యువు ముందు ఓడిపోయారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలతో పాటు ఇద్దరు అన్నలున్నారు. పెద్దన్న వీరిశెట్టి హజరత్‌బాబు (మురళీకృష్ణ హోటల్స్) కాగా, రెండవవాడు వీరిశెట్టి ప్రసాద్.***

బారకాసు సెంటర్‌లో 1984 నుంచి 2014 దాకా ‘నాగరాజం ప్రొవిజన్స్’ నడిపి నాణ్యమైన వస్తుసామాగ్రికి, నిత్యావసర వస్తువులకు కేరాఫ్‌గా నిలిచింది కూడా వీరి కుటుంబమే. వీరంతా నాగరాజం కుమారులే. సుబ్బారావు మృతితో వీరిశెట్టి కుటుంబసభ్యులు, బంధుమిత్రులంతా శోకసముద్రంలో మునిగిపోయారు. వీరిశెట్టి నాగరాజం–నరసమ్మ దంపతులకు 1962లో సుబ్బారావు అయిదవ సంతానంగా జన్మించారు.

నెల్లూరులోని సీఏఎం, విఆర్ విద్యాసంస్థల్లో చదువుకుని, ఆ తర్వాత హోటల్ మేనేజ్‌మెంట్‌పై ఆసక్తితో అందులో మెళకువలు తెలుసుకున్నారు. సుబ్బారావుకి రెస్టారెంట్ నడపాలనే ఆసక్తి ఉండేది. తమ కుటుంబ ఆధ్వర్యంలో పొగతోటలో 1981లో నెలకొల్పబడి తమ సోదరుడు హజరత్‌బాబు నేతృత్వంలో నడుస్తుండిన “శ్రీ వెంకటరమణ విలాస్” శాఖాహార టిఫిన్ మరియు భోజన హోటల్ నిర్వహణ బాధ్యతను 1991 నుండి సుబ్బారావు పూర్తిగా తన భుజస్కందాలపైకి తీసుకున్నారు. అప్పటికే బహుళ ప్రాచుర్యంలో ఉన్న వెంకటరమణని మరింత విస్తృతస్థాయిలో అభివృద్ధి చేశారు. అక్కడ భోజనం చేయాలన్నా, టిఫిన్ చేయాలన్నా కనీసం 20 నిముషాలు సీటుకోసం వేచి ఉండాలన్నంతస్థాయిలో ఆ హోటల్‌ని అభివృద్ధి చేశారు. ప్రస్తుతం ‘పద్మావతి తాజా తిండి’, ‘వెంకటరమణ విలాస్’లుగా అవి నేటికీ ఎంతో ప్రసిద్ధి.

ఆ తరువాత, నెల్లూరులో 1994లో తొలిసారిగా మహానగరాలలోని రెస్టారెంట్లకి ధీటుగా అధునాతన హంగులతో, ఆధునిక సాంకేతిక వంట పరికరాలతో నాణ్యమైన, రుచికరమైన పదార్థాలతో “మయూరి మల్టి క్యుసైన్ రెస్టారెంటు”ని ప్రారంభించారు. ఆనతికాలంలోనే ‘మయూరి’ని మన ఊరి ఉత్తమ మాంసాహార రెస్టారెంటుగా ‘మయూరి’ని తీర్చిదిద్దారు. ఆ రెస్టారెంటు ఎంత ప్రసిద్ధి చెందిందంటే, వీరిశెట్టి సుబ్బారావు ఇంటి పేరే “మయూరి” సుబ్బారావు అని మారిపోయేంతలా ఆయనకి పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టింది.

కరోనా మాయలమారి ‘మయూరి’ని మూయించేంతగా సుబ్బారావుని ప్రభావితం చేస్తే... క్యాన్సర్ మహమ్మారి ఆయన ప్రాణాలనే హరించింది.

సుబ్బారావు స్వతహాగా సౌమ్యుడు, మితభాషి. ఆయనకి ముగ్గురు కూతుళ్ళు. పెద్దకూతురు పుష్పవల్లి, ఆమె భర్త డాక్టర్ చంద్రమౌళితో కలసి బెంగుళూరులో నివాసం ఉంటున్నారు. రెండవ కూతురు నీరజ తన భర్త డాక్టర్ కీర్తిచంద్రతో కలసి తిరుపతిలో ఉన్నారు. మూడవ కుమార్తె లిఖిత తన భర్త వంశీకృష్ణ(సాఫ్ట్‌వేర్ ఇంజనీర్)తో కలిసి అమెరికాలో స్థిరపడ్డారు.

సుబ్బారావుకి దైవభక్తి ఎక్కువ. అందులోనూ శివభక్తుడు. ఇంట్లో ఆయన పూజ గది ఒక గుడిలా ఉంటుంది. పూజలతో పాటు అనునిత్యం దానధర్మాలు కూడా చేసేవారు. కానీ కుడిచేత్తో ఇచ్చింది ఎడమ చేతికి తెలియనిచ్చేవారు కాదు. క్యాన్సర్ వ్యాధిగ్రస్తులంటే ఆయనకు మరింత సానుభూతి. వారికి ఏదోవిధంగా సాయం చేయాలని తపన పడుతుండేవారు. నెల్లూరు ‘లయన్స్‌క్లబ్’ ఆధ్వర్యంలో బెంగుళూరు నుంచి క్యాన్సర్ ఫౌండేషన్ వారు నెల్లూరుకు ఓ ప్రత్యేక వాహనంలో వచ్చి క్యాన్సర్ వ్యాధిని నిర్ధారించి, రోగులకు వైద్యసేవలు చేసేవారు. ఆ కార్యక్రమాల్లో ఆయన అనేకసార్లు పాల్గొని, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు తనవంతు సాయం అందిస్తుండేవారు. చివరికి.. ఆ క్యాన్సర్ వ్యాధితోనే ఆయన కన్ను మూయడం.. విధి విచిత్రం!

‘మయూరి సుబ్బారావు’ మరణం ఆయన కుటుంబ సభ్యులకే కాదు.. రెస్టారెంట్ రంగానికే పూడ్చలేని లోటు. ఆయన మృతికి చింతిస్తూ, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేస్తోంది..‘లాయర్’!..

# జాతీయ ప్రవేశ పరీక్షల ప్రక్షాళనకు ఇదే మంచి సమయం!

దేశ పురోగతికి కీలకమైన అంశాలు చాలా ఉంటాయి. వాటిలో విద్య, వైద్యం అత్యంత ముఖ్యమైనవి. విద్య విచక్షణని, శాస్త్రీయదృక్పథాన్ని, జ్ఞానాన్ని పెంచుతుంది. మంచిని, మర్యాదని, సమాజంలో మనుగడ సాధించడానికి అవసరమైన నడవడికని నేర్పుతుంది. వైద్యం సమాజాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. ఆరోగ్యవంతమైన విద్యావంతులున్న సమాజం మిగిలిన సమాజాలకన్నా ఉన్నత స్థానంలో ఉంటుంది. మెరుగైన సమాజంలో వైద్యాన్ని నేర్పించే విద్యకు మరింత ప్రాధాన్యం ఉంటుంది. వైద్య విద్యలో నాణ్యత లేకపోతే ఫలితాలు దారుణంగా ఉంటాయి. వైద్యో నారాయణో హరీ: అన్నారు పెద్దలు. అంటే వైద్యుడు భగవంతుడితో సమానం అని అర్థం.

ఇంతటి ప్రాముఖ్యం ఉన్న వైద్య విద్యలో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పరీక్షాపత్రం లీక్ అయిందన్న విషయం బయటకు రావడంతో దేశం యావత్తు నివ్వెరపోయింది. నీట్‌లో అక్రమాలేమీ జరగలేదని తొలుత కేంద్ర ప్రభుత్వం ఖండించింది. అయితే అవకతవకలకు సంబంధించి వస్తున్న ఆరోపణల్లో హేతుబద్ధత కనిపించడంతో మెల్లగా సీబీఐ విచారణకు ఆదేశించింది. మే 5న నిర్వహించిన నీట్ యూజీ-2024 పరీక్షల్లో మునుపెన్నడూ లేని విధంగా దేశవ్యాప్తంగా ఏకంగా 67 మందికి మొదటి ర్యాంకు రావడంతో పేపర్ లీక్ అయిందన్న ఆరోపణలకు బలం చేకూరింది. (తాజాగా సవరించిన ర్యాంకుల ప్రకారం టాపర్ల సంఖ్య 61కి తగ్గింది.) దీంతో రాజకీయంగా విమర్శలు చెలరేగాయి. విపక్షాలు విరుచుకుపడ్డాయి. 24 లక్షల మంది రాసిన ఈ పరీక్షల్లో అవకతవకలు జరిగాయని దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో కేసులు కూడా నమోదు కావడంతో పారదర్శకత కోసం సీబీఐతో దర్యాప్తు చేయించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈ కేసులో గుజరాత్‌లోని గోద్రాలో ఓ ప్రైవేట్ స్కూల్ యజమానిని సీబీఐ తాజాగా అదుపులోకి తీసుకుంది. దీంతో ఈ కేసులో ఇప్పటివరకు మొత్తం ఆరుగురు అరెస్టయ్యారు.

మరోవైపు పార్లమెంటులో నీట్‌పై చర్చ జరగాలని విపక్షం పట్టుపడుతోంది. ఈ అంశంపై ఒక రోజంతా చర్చ జరగాలని ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. ఈ విషయమై గత శుక్రవారం లోక్‌సభలో రభస జరగడంతో సభను సైతం వాయిదా వేశారు. నీట్ పై చర్చకు ప్రభుత్వం ముందుకు రావాలని ఆయన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా ఈ అంశం లేవనెత్తటమేమిటని ప్రభుత్వం విపక్షాన్ని తప్పు పట్టింది. నిబంధనల ప్రకారం ప్రభుత్వం చర్చకు సిద్ధమైతే పాలనపై విశ్వసనీయత మరింత పెరుగుతుంది. నీట్ యూజీ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారంపై తీవ్ర దుమారం చెలరేగిన నేపథ్యంలో వాయిదా పడిన నీట్ పీజీ పరీక్షపై అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అవకతవకలకు ఆస్కారం లేకుండా పరీక్షకు రెండు గంటల ముందు మాత్రమే ప్రశ్నాపత్రం సిద్ధం చేయాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది.

## అయోమయం, ఆందోళనలతో విద్యార్థినీ విద్యార్థులు వారి తల్లితండ్రులు!

అర్హత కోసం పెట్టే పరీక్షల్లో అనర్హులకు ర్యాంకులు వచ్చే పరిస్థితి తలెత్తడంతో ఏడాదంతా కష్టపడిన విద్యార్థులు, తల్లి దండ్రులు చాలా ఆందోళన చెందుతున్నారు. ఇది కేవలం ఆ విద్యార్థులు, తల్లిదండ్రుల ఆవేదన మాత్రమే కాదు. మొత్తం దేశానిది కూడా. ఎందుకంటే ఇప్పటికే కార్పొరేట్ వైద్యం చాలా ఖరీదయిపోయింది. వైద్య బీమా లేనిదే మధ్యతరగతి, పేదతరగతి కుటుంబాల వారు కార్పొరేట్ వైద్యం చేయించుకునే పరిస్థితి లేదు. దీనికితోడు అర్హత ప్రక్రియలోని లొసుగులను అడ్డం పెట్టుకుని అనర్హులు వైద్యులుగా చలామణీ అయిపోతే ఆస్పత్రిలోపలికి వెళ్లిన వారు బయటకు ప్రాణాలతో వస్తారన్న భరోసా ఉండదు. సంవత్సరాల పాటు నకిలీ వైద్యులు ఆస్పత్రులను నిర్వహిస్తున్నారని, వైద్యం చేసేస్తున్నారనే వార్తలు వింటూనే ఉన్నాం. ఈ నేపథ్యంలో నీట్ పరీక్షా పత్రం లీక్ అయిందన్న ఆరోపణలు చాలా ఆందోళనకరం.

## ఇదే తొలిసారి కాదు!

నీట్‌లో అక్రమాలు ఈ ఏడాదే తొలిసారి జరిగాయనుకోవడానికి వీల్లేదని, గతంలోనూ జరిగాయని అనుమానాలు కలుగుతున్నాయి. మొదటిసారి లక్షల్లో ర్యాంకులు సాధించి, రెండోసారి మాత్రం వేలల్లో ర్యాంకులు తెచ్చుకున్నారంటూ ఓ ఆంగ్ల పత్రిక వెల్లడించింది. కొన్ని ఉదాహరణలను కూడా పొందుపరిచింది. ముంబైలో ఎంబీబీఎస్ చదువుతున్న ఓ విద్యార్థినికి 2022లో మొదటిసారి నీట్ రాసినప్పుడు రెండు లక్షలపైన ర్యాంకు రాగా 2023లో మరోసారి రాస్తే దాదాపు 8వేల ర్యాంకు వచ్చినట్లు ఆ కథనం వెల్లడించింది. ముంబైలోనే ఎంబీబీఎస్ చదువుతున్న మరో విద్యార్థినికి 2022లో 10 లక్షలకు పైగా ర్యాంకు రాగా, 2023లో రెండో ప్రయత్నంలో దాదాపు 13వేల ర్యాంకు వచ్చిందని పేర్కొంది. ఇలా రెండోసారి మెరుగైన ర్యాంకులు తెచ్చుకున్న విద్యార్థుల్లో కొందరు వారు నివసించే నగరాల్లో కాకుండా దూరంగా ఉండే చిన్న పట్టణాల్లోని పరీక్షా కేంద్రాల్లో పరీక్ష రాయడంతో అక్రమాలు జరిగాయన్న అనుమానాలకి బలం చేకూరుతోంది.

## రూ.200 కోట్ల సంపాదన లక్ష్యంగా!

నీట్ 2024 ప్రశ్న పత్రం లీక్ చేయడంలో సూత్రధారిగా భావిస్తున్న సంజీవ్ ముఖియా గతంలోనూ ప్రశ్నపత్రాలు లీక్ చేసేవాడన్న ఆరోపణలున్నాయి. దాదాపు 700 మందికి ఈసారి పరీక్షా పత్రం విక్రయించాడని, రూ.100కోట్ల నుంచి రూ.200 కోట్లు దీని ద్వారా సంపాదించాలని ఆయన లక్ష్యంగా పెట్టుకున్నాడన్న విస్తుగొలిపే వాస్తవాలని మరో నిందితుడు బిజేంద్ర గుప్తా ఒక స్టింగ్ ఆపరేషన్‌లో వెల్లడించాడు. ప్రవేశపత్రాల లీక్ అన్నది దేశవ్యాప్తంగా ఒక పెద్ద మాఫియా ఆయన మాటలను బట్టి అర్థమవుతోంది. ఒడిశా స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ పరీక్షపత్రం లీక్, బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్ష లీక్ కేసులో, మధ్యప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్ష పేపర్ లీక్ కేసులో అతనికి సంబంధాలున్నాయని తెలుస్తోంది. "ఏముంది.. జైలుకెళ్తాం, బెయిల్ తెచ్చుకుంటాం, మళ్లీ ఆట మొదలు పెడతాం" అని ఆ స్టింగ్ ఆపరేషన్‌లో అతను నిస్సిగ్గుగా చెప్పాడంటే వ్యవస్థలో ఎన్ని లొసుగులున్నాయో అర్థమవుతోంది. పెద్ద తలకాయల అండలేనిదే ఇంతటి భారీ కుంభకోణానికి పాల్పడే సాహసం చేయకపోవచ్చు. ఎవరి అండతో లీక్ వీరులు ఈ దందా చేస్తున్నారో సీబీఐ నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉంది.

## భరతం పట్టాలి!

ప్రతిభకు పట్టం కట్టడమే ప్రవేశ పరీక్షల ఉద్దేశం. ఆ ఉద్దేశాన్ని నీరుగార్చేలా వ్యవస్థకు గండికొడుతున్న వారి భరతం పట్టకపోతే దీర్ఘకాలంలో దేశం భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. యువతరాన్ని మేధావులుగా తీర్చి దిద్దే విద్యారంగమే కలుషితమైతే దేశ భవిష్యత్తే ప్రశ్నార్థకంగా మారే ప్రమాదముంది. నాణ్యమైన విద్యతో రేపటి పౌరులని తీర్చేదిద్దగలిగితేనే అంతర్జాతీయంగా మనం పోటీ పడగలం. అక్రమాలు, అవకతవకలకు పాల్పడుతూ, లొసుగులను అడ్డం పెట్టుకుని చచ్చు, పుచ్చు తలలు దొడ్డిదారిన వ్యవస్థల్లో చేరితే దేశ మనుగడకే ప్రమాదం. ఇలాంటి చీడపురుగులను ఆదిలోనే ఏరిపారేయాలి. దేశ వ్యాప్తంగా అన్ని ప్రవేశ పరీక్షల ప్రక్రియలను సమూలంగా ప్రక్షాళించడానికి ఇదే సరైన సమయం. ప్రస్తుతం జరుగుతున్న దర్యాప్తు, విచారణ కేవలం నీట్ లీక్ వ్యవహారానికే పరిమితం కాకుండా మిగిలిన విభాగాలపై కూడా దృష్టి సారించాలి. మొత్తం ప్రవేశపరీక్షల్లో చోటు చేసుకుంటున్న అక్రమాలు, లొసుగులను, లోపాలను బయటపెట్టి కలుగులో దాక్కొన్న ఎలుకలను వెలుగులోకి తీసుకురావాల్సిన సమయం ఆసన్నమయింది.



**తుమ్మల బాల గంగాధర్ తిలక్**




కైక ఇచ్చిన ఆభరణాన్ని విసుగుతో, కోపంతో నేలకేసికొట్టింది మంథర!. మూఢురాలా శోకించవలసిన సమయంలో ఈ ఆనందమేమిటి? నిన్ను చూసి నాకు నవ్వువస్తుంది! సపత్నుల వృద్ధికి సంతసించే స్త్రీని నిన్నే చూశా!.

కౌసల్య కొంతసేపటి తరువాత రాజమాత అవుతుంది! నీవేమవుతావు? ఆవిడ ఎదురుగా చేతులు కట్టుకు నిల్చొనే దాసి అవుతావా?

రాముడు రాజు అయితే భరతుడు సేవకుడై ఊడిగం చేస్తాడా?

ఈ విధంగా మాట్లాడుతున్న మంథరను చూసి రాముడి గుర్చి నీకేమి తెలుసని మాట్లాడుతున్నావు? రాముడెట్లాంటి వాడో వినవే అని కైక చెప్పదొడగింది!.

***ధర్మజ్ఞో గురుభిర్దాన్తః కృతజ్ఞః సత్యవాక్ఛుచిః***
***రామో రాజ్ఞః సుతో జ్యేష్ఠో యౌవరాజ్యమతోర్హతి!.***

రాముడు ధర్మాత్ముడు! పెద్దల వద్ద విద్యాబుద్ధులు నేర్చినవాడు, కృతజ్ఞుడు, సత్యవచనాలు పలికేవాడు! నిర్మలమైన చరితకలవాడు, పైగా పెద్దకొడుకు! అతడే రాజ్యవటానికి అర్హుడు! ఒసే గూనిదానా! తన తమ్ములను తండ్రిలాగా చూసుకుంటాడే! నూరుసంవత్సరాలు రాముడుపాలించిన పిదప భరతుడు పరిపాలింపగలడు !

ఇది అత్యంత ఆనందదాయకం,కళ్యాణకరం అయిన సమయం... అనవసరంగా రోదించకు.

వాడు! నా రాముడు! నా ఒడిలో పెరిగినవాడు! భరతునికన్నా నాకు వాడే ఎక్కువ!

అయినా రాముడికి రాజ్యముంటే అది భరతుడికి కూడా ఉన్నట్లే! తమ్ములంటే ఏ విధమైన భేదభావం లేనివాడు రాముడు!

ఆ మాటలు విని దీర్ఘంగా నిట్టూర్చి మంథర! నీ కొడుకును నీకు దూరంగా పెంచాడు దశరథుడు! రాముడికి లక్ష్మణుడు అంటేనే ప్రేమ, ఏ విధంగా చూసినా రాముడి తరువాత అతని కొడుకులు రాజులు అవుతారు! నీ కొడుకెందుకవుతాడు?

నీ కొడుకును రాముడు చంపివేసినా చంపివేయవచ్చు! తన రాజ్యాధికారానికి అడ్డం వస్తాడేమోనని!

నీకు శాశ్వతమైన అవమానం! దుఃఖం!

అయిపోయింది! అమృతం ఒలికిపోయింది! హృదయం నిండా అమృతాన్ని నింపుకున్న కైక మంథర మాటలకు దాన్ని ఒలకపోసుకొని కాలకూటవిషంతో నింపింది!

కన్నులెర్రబడ్డవి, దెబ్బతిన్నపాములాగా బుస్సున లేచింది! చెక్కిళ్ళు ఎర్రబడ్డవి. నెయ్యిపోయగా భగ్గున మండే జ్వాలలాగ అయ్యింది ఆవిడ మానసం!

ఆ రాముడిని ఇప్పుడే అడవుల పాల్జేస్తాను చూసుకో అంటూ దిగ్గున లేచింది!

మంథరా! రాముని పట్టాభిషేకం తప్పించే ఉపాయం ఆలోచించవే! వాడిని ఎలాగైనా సరే అడవులకు పంపాలి! అడిగింది కైక.

పూర్వం నీవే నాకు ఒక విషయం చెప్పావు గుర్తులేదా! అయితే చెపుతా విను! మహారాజు శంబరాసురునితో యుద్ధానికి వెళ్ళినప్పుడు నీవు కూడా ఆయన వెంట వెళ్ళావు!

ఆ యుద్ధంలో ఒకసారి గాయాలబారినపడి స్పృహకోల్పోయిన దశరథుడిని రాక్షసులబారినుండి నేర్పుగా నీవు తప్పించావు!. అందుకు రాజు సంతోషించి నీకు రెండు వరాలిచ్చాడు! నీవు అవసరమైనప్పుడు ఆ వరాలు కోరుకుంటానన్నావు, అందుకు రాజు సరేనన్నాడు! గుర్తుకు వచ్చిందా!

ఇదే సరైన సమయం ఆ రెండు వరాలు ఇప్పుడు కోరుకో!

నీ కొడుకు భరతుడికి రాజ్యపట్టాభిషేకం, రామునికి పదునాలుగేండ్లు అరణ్యవాసం.

పదునాలుగేండ్లు భరతుడు పరిపాలించెనా! జనం మనస్సులో చిరస్థాయిగా నిలిచిపోతాడు, రాజ్యాధికారం స్థిరమవుతుంది! అని చెప్పి, నీవు నిరాలంకారవై, మలినవస్త్రాలు ధరించు! నీ మగడు వచ్చే వేళ అయింది! ఆయనతో మాటాడకు మొదట బెట్టు చేయి!. అని నూరిపోసింది మంథర!.

ఇలా పలికిన మంథర, కైక కంటికి మనోహరంగా కనపడింది!



రాజహంసలాగ ఉన్నావే నీవు అంటూ ప్రశంసించింది.

నీ గూని కూడా ఎంత అందంగా ఉన్నదే! దానికి బంగరుమాల తొడిగి అలంకరిస్తాను భరతుడు రాజు కాగానే !

ఈ మాటలు, వరాలమూటలు తరువాత, ముందు కాగల కార్యం చూడమ్మా కైకమ్మా! రాజు వచ్చే వేళ అయ్యింది అని హెచ్చరించింది దాసి మంథర!.

వంటికున్న అన్ని ఆభరణాలు తొలగించి, మాసిన చీర ధరించి మంథరతో కలసి కోపగృహప్రవేశం చేసింది కైక!.

కైకను చూడకుండా దశరథుడుండలేడు, కౌసల్యా మందిరానికి ఎప్పుడోగాని పోడు!

ఆమె ఆయనకు కామసంజీవనౌషధి, ఆమె పెడమొగమైతే ఆయనకు నరకమే! రాముని పట్టాభిషేక వార్త ఆవిడకింకా చెప్పలేదు! తనకు చెప్పనందుకు ఎంతకోపంతో ఉందో ఏమో! వెంటనే చెప్పి ఆవిడను ప్రసన్నురాలిని చేసుకోవాలి, కసిరికొడితే బుజ్జగించాలి, కోపగిస్తే లాలించాలి ఏ విధంగానైనా ఆవిడను ప్రసన్నురాలిని చేసుకోవాలి అని ఆలోచిస్తూ కైక మందిరంలో అడుగుపెట్టాడు దశరథుడు. ..(సశేషం)

## స్నేహశీలి, ప్రతిభాశాలి మోపూరు చంద్రశేఖరం

# రిటైర్ అయినా మా మనసుల్లో ఉంటాడు నిరంతరం






సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్(విద్యుత్ శాఖ)లో చిరు ఉద్యోగిగా చేరి 33 సంవత్సరాలు బాధ్యతతో, అంకితభావంతో సేవలందించి అసిస్టెంట్ ఇంజనీరు స్థాయికి ఎదిగి పదవీ విరమణ పొందిన మోపూరు చంద్రశేఖరం అభినందన కార్యక్రమం సోమవారం నెల్లూరులో జరిగింది. విద్యుత్ శాఖ ఉద్యోగిగా వివిధహోదా లలో, పలు ప్రాంతాలలో చంద్రశేఖరం చేసిన సేవలని ఆయన సహచర ఉద్యోగులు కొనియాడారు.

ఓ వైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే మరోవైపు ఏపీ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్‌లో చురుకైన పాత్ర పోషిస్తూ ప్రధాన కార్యదర్శి స్థాయికి చేరిన చంద్రశేఖరం చొరవని, ప్రతిభని కూడా అసోసియేషన్ సభ్యులు శ్లాఘించారు. అసోసి యేషన్ పట్ల చంద్రశేఖరంకి ఉన్న మమకారానికి నిదర్శనంగా తిరుపతిలో నిర్మింపబడుతున్న అసోసియేషన్ భవనమే ప్రత్యక్ష సాక్ష్యమని ఈ సందర్భంగా అసోసియేషన్‌లో వివిధ హోదాలలో ఉన్న సభ్యులు చంద్రశేఖరంని కీర్తించారు.

ఏపీ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ నెల్లూరుజిల్లా అధ్యక్షులు సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన పదవీ విరమణ అభినందన వేడుకలో విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ విజయన్, విద్యుత్ శాఖలో పలు విభాగాలలో సేవలందిస్తున్న ఉద్యోగులు, చంద్రశేఖరం అభిమానులు, హితులు, సన్నిహితులు, స్నేహితులు, ఆయన కుటుంబసభ్యులు పాల్గొని చంద్రశేఖరం – లక్ష్మీ దంపతులని ఘనంగా సత్కరించారు.

# నలుగురు గవర్నర్లతో డాక్టర్ సీఎంకే రెడ్డి




చెన్నై రాజభవన్‌లో అరుదైన సంఘటన చోటు చేసుకుంది. "గవర్నర్‌పేట్ టు గవర్నర్స్ హౌస్" పేరుతో మాజీ గవర్నర్ పి.ఎస్.రామమోహన్‌రావు రాసిన పుస్తకాన్ని తమిళనాడు ప్రస్తుత గవర్నర్ ఆర్.ఎన్.రవి గత శనివారం చెన్నైలోని గవర్నర్ బంగ్లాలో ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో రామ్మోహన్‌రావుతో పాటు మరో ఇద్దరు మాజీ గవర్నర్లు సి.రంగరాజన్, ఎన్.కె.నారాయణన్‌లు కూడా పాల్గొన్నారు. తమిళనాట తెలుగువారి పెద్దదిక్కు డాక్టర్ ముద్దుకృష్ణారెడ్డి కూడా ఈ నలుగురు గవర్నర్లతో పాటు మరో అతిథిగా కార్యక్రమంలో పాల్గొనడం విశేషం.

## జొన్నవాడ ఇఓగా.. బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులురెడ్డి



జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం.. బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున సమేత కామాక్షి తాయి దేవస్థానం సహాయ కమిషనర్ మరియు కార్య నిర్వహణాధికారిగా ఆర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి జులై 1న బాధ్యతలు చేపట్టారు. తొలుత ఆయన శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి అమ్మవార్లని దర్శిం చుకుని పూజలు చేసి, ఆలయ అర్చకుల ఆశీర్వచనా లందుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది ఆయన్ను కార్యాలయంలోకి సాదరంగా స్వాగతించి శుభాకాంక్షలు తెలిపారు.

# నాన్న అలా.. కొడుకు ఇలా..!

(మొదటిపేజీ తరువాయి)

### చరిత్రాత్మకం, స్ఫూర్తిదాయకం రాజశేఖరరెడ్డి ప్రస్థానం!

ఒక సామాన్యుడిగా రాజకీయ రంగ ప్రవేశం చేసి అసామాన్య స్థాయికి ఎదిగిన ఘనచరిత్ర రాజశేఖరరెడ్డిది. తాను ముఖ్యమంత్రి కాకముందు పాతికేళ్ళపాటు నిర్విరామంగా, నిరంతరాయంగా, నిస్వా ర్థంగా ప్రజల మధ్య తిరిగారాయన. ప్రజా సంక్షేమం కోసం ఎవరితోనైనా, ఎలాంటి సందర్భంలోనైనా, అవతలి వ్యక్తి ఎంతటి వాడైనా తాను చెప్పదలచుకున్నది నిర్భ యంగా, నిర్మొహమాటంగా చెప్పడానికి సంకోచించని నైజం రాజశేఖరరెడ్డిది.

ప్రజాసేవలో పాతికేళ్ళ పోరాటం ఒక చరిత్ర అయితే, 2003లో ఆయన తన ప్రాణాలని సైతం పణంగాపెట్టి చేపట్టిన ప్రజాప్రస్థానం పాదయాత్ర మరో చరిత్ర. దేశరాజకీయ రంగంలోనే అదొక సంచలనం.

ఉమ్మడి రాష్ట్రంలో చేవెళ్ల నుండి ఇచ్ఛాపురం వరకు 68 రోజుల పాటు 1470 కిలోమీటర్లు ఆయన కాలినడకన తిరిగారు. ఆ పాదయాత్రలో ఆయన ప్రజల కష్టాలని చూశారు. వాళ్ళ కన్నీళ్ళని తుడిచారు. ఆకలితో అలమటించిపోతున్న పేదల బాధలు గమనించారు. ఎండిన భూములతో.. నిండని కడుపులతో అల్లాడు తున్న రైతన్నల ఆక్రందన చూసి చలించి పోయారు. కరెంటు బిల్లులు సైతం కట్టలేక అల్లాడిపోతున్న వారి దీనస్థితిని చూసి కదలిపోయారు. తన సుదీర్ఘ కాలినడకలో అభివృద్ధి కరువై అష్టకష్టాలు పడుతున్న ప్రతి రంగాన్నీ ఆయన స్పృశించారు. ముఖ్యమంత్రిగా 2004లో తాను పదవీ బాధ్యతలు చేపట్టిన నాటినుండి, 2009 సెప్టెంబర్ 2న తన తుదిశ్వాస విడిచేవరకు ఆ రంగాల అభ్యున్నతి కోసం తపించారు.

పదవిలోకి వచ్చీరాగానే ఉచిత విద్యుత్తు ఫైలుపై తొలి సంతకం చేశారు. జల యజ్ఞం పేరుతో నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆరోగ్య శ్రీతో పేదవారికి కార్పొరేట్ వైద్యాన్ని పరి చయం చేశారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్ పథకంతో పేద విద్యార్థినీవిద్యార్థులకి కార్పొరేట్ విద్యని అందుబాటులోకి తెచ్చారు. మహిళలకి పావలావడ్డీ రుణాలు అందించి వారి జీవితాలలో వెలుగులు నింపారు.

### ప్రజలే సర్వస్వం..

నిద్రలేచిన దగ్గరనుండి మళ్ళీ నిద్రపోయే వరకు ప్రజల మధ్యనే ఉండే వారు. ప్రజల బాగోగుల గురించే ఆలో చన చేసేవారు. వేకువఝామున 4.30 గంటలకే తన అత్యంత ఆంతరంగిక మిత్రులను కలుసుకునేవారు. ఉదయం 5 గంటలకే అధికారులతో సమీక్షలు జరిపే వారు. ఉదయం 8.30 గంటలకి ప్రజా దర్బారులో సామాన్య జనాన్ని కలుసుకుని వారి విన్నపాలు వినేవారు, వారి అభ్యర్థన లని స్వీకరించేవారు. ఆ తరువాత సచివా లయానికి వెళ్ళేముందు తన ఆప్తులని, మిత్రులని, పార్టీ శ్రేణులని కలుసుకునే వారు. ఇక సచివాలయం చేరాక రాష్ట్రంలో పరిశ్రమలు, రహదారుల నిర్మాణం, మౌళిక సదుపాయాల కల్పన వంటి అనేక అంశాలపై నిత్యం దృష్టిపెట్టి పనిచేసేవారు. నిరంతరం జిల్లాల పర్యటనలు కొనసా గిస్తూనే ఉండేవారు. చివరికి తన తుది శ్వాస కూడా ప్రజాసేవ కోసం వెళ్తూనే విడిచారు. ఇదీ రాజశేఖరరెడ్డి పాలన.

### రాజన్నకి రాజకీయాలు వేరు.. కుటుంబం వేరు!

రాజశేఖరరెడ్డి రాజకీయాలని, తన కుటుంబాన్ని వేరువేరుగా చూసేవారు. రెండింటికీ సమ ప్రాధాన్యతని ఇచ్చేవారు. కానీ, తన కుటుంబ విషయాలు పొరపాటుగా కూడా ఎక్కడా బహిర్గతం కానిచ్చేవారు కాదు. ఇంటి గుట్టు బయటకి పొక్కనిచ్చేవారు కాదు.

### రాజకీయాలకి అతీతంగా సొంత సైన్యం!

రాజకీయాలకి అతీతంగా రాజశేఖర రెడ్డి తన సొంత సైన్యాన్ని ఏర్పరచుకు న్నారు. రాజకీయాలకి సంబంధంలేని వ్యక్తులని తన ఆంతరంగికులుగా నియమిం చుకున్నారు. తన కోసం ప్రాణాలైనా ఇవ్వడానికి సిద్ధపడే అభిమానులని ఆయన తన సొంతం చేసుకున్నారు. ఆ స్థాయిలో వారి ప్రేమాభిమానాలని పొందారు.

రాజశేఖరరెడ్డి జనంలో తిరిగేవారు, జనంలో మెలిగేవారు, జనంతోనే మెదిలే వారు, జనం కోసమే బ్రతికేవారు. జనాన్ని నమ్మేవారు, జనానికి నమ్మకాన్ని కలిగించే వారు. జనాన్ని ప్రేమించేవారు, జనం చేత ఆరాధింపబడేవారు. ఆయనకి ఉండడా నికి బంగళాలు అవసరం లేదు. ప్రజా క్షేత్రమే ఆయన గృహం. జనం మధ్యకి వెళ్ళినప్పుడు ఆయన రక్షణ కోసం పరదాలు అవసరం లేదు. ఆయన కోసం ప్రాణాలిచ్చే ఆయన అనుయాయులే ఆయనకి రక్షకులు. దటీజ్ వై.ఎస్.ఆర్!

### చరిత్ర హీనం... అత్యంత దీనం జగన్ పాలన!

రాజశేఖరరెడ్డి వారసుడిగా జగన్ మోహన్‌రెడ్డి రాజకీయాలలోకి వచ్చారు. కొత్త రాష్ట్రంలో 2014లో జరిగిన తొలి ఎన్నికలలో జనం ఆయనని నమ్మలేదు. అప్పటినుండి అయిదేళ్ళ పాటు ఆయన జనంలో తిరిగారు. తన నాన్నలాగే పాద యాత్ర చేశారు. ఒక్క అవకాశం ఇవ్వండి అంటూ ప్రజలని వేడుకున్నాడు. కానీ, తన నాన్న లాగా ఆయన పాదయాత్రలో ప్రజల కష్టాలు చూడలేదు. వాళ్ళ కన్నీళ్ళు గమ నించలేదు. తన చుట్టూ అత్యంత భద్రతతో కూడిన వలయాన్ని ఏర్పరచుకుని నడిచారు. తాను తిరిగిన ప్రతీచోట ఆర్థిక వనరులని, వాటి మూలాల్ని వెతుక్కుంటూ వెళ్లారు. ఎక్కడెక్కడ నుండి ధనాన్ని తవ్వి తీయొచ్చో గమనించుకుంటూ నడిచారు. తాను కోరుకున్నట్లుగానే 2019లో అధికారంలోకి వచ్చారు. వచ్చిన తక్షణమే మద్యం వ్యాపా రాన్ని ప్రభుత్వ ఆధీనంలోకి తెచ్చారు. రివర్స్ టెండరింగ్ అంటూ కాంట్రాక్టర్ల ఆదాయానికి గండి కొట్టారు. ఇసుక, సిలికా, క్వార్ట్జ్, గ్రావెల్... అన్ని విభాగా లని తన కనుసైగలలోకి తెచ్చుకున్నారు. ఆదాయ వనరులన్నింటినీ తన గుప్పిట్లో పెట్టుకున్నారు.

నవరత్నాలు అంటూ ప్రజల ఖాతా లలో నేరుగా డబ్బులేసి ప్రభుత్వ డబ్బులతో ఓట్లు కొనే పనిలో పడిపోయారు. తన మంత్రులు, శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు చేస్తున్న అరాచకాలని పట్టించుకో లేదు. బూతుల సామ్రాట్టుల నోళ్ళకి కళ్లెం వేయలేదు, ఇంటి గుట్టు బయటపెడుతున్న అమ్మని, చెల్లిని కూడా అదుపు చేయలేదు. తనది హెడ్‌ఆఫీస్, తన ఏం.ఎల్.ఏలవి బ్రాంచ్ కార్యాలయాలన్నట్లుగా దండకా లకి తెరలేపారు.

రాష్ట్రంలో రహదారులను గాలికొది లేశారు. మౌలిక సదుపాయాల సంగతే మర్చిపోయారు. ఉద్యోగుల నిరసనలని చెవిన పెట్టుకోలేదు. మూడు రాజధాను లంటూ అసలు రాజధానే లేకుండా చేశారు. మోడీతో సయోధ్య ఉన్నా కేసుల సంగతి తప్ప ప్రత్యేకహోదా సంగతే ఎత్త లేదు. తన సొంత సామాజికవర్గాన్ని దగ్గర తీయలేదు. నీటి పారుదల ప్రాజెక్టుల్ని పట్టించుకోలేదు, ఆరోగ్యశ్రీ అరియర్స్‌ని ఆపేశారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకా యిలు చెల్లించలేదు. అభివృద్ధి అన్న పదాన్ని అటకెక్కించారు. తనకంటూ సొంత మనుషులని ఏర్పరచుకోలేదు. కార్పొరేట్ తరహాలో సిఐఓల వ్యవస్థని ఏర్పాటు చేసుకొని, సలహాదారులంటూ అపరిపక్వ ప్రబుద్ధులని పక్కనపెట్టుకుని అప్రతిష్ఠ మూటకట్టుకున్నారు. సచివా లయం ముఖమే చూడలేదు. ఒక్క రాత్రి కూడా జిల్లా కేంద్రాలలో గడపలేదు. మీడియా వాసన కూడా దగ్గరకి చేరనీయ లేదు. గెలవకముందు జనానికి ముద్దులు పెట్టిన జగన్, గెలిచిన తరువాత తనకి–ప్రజలకి మధ్య బ్యారికేడ్లు పెట్టుకున్నారు. 'నేను మీకు డబ్బులిస్తున్నా... మీరు నాకు ఓట్లేయండి" అంటూ జనానికి ఊదరగొ ట్టడం మొదలుపెట్టాడు. 'సిద్ధం' అంటూ జనంలోకి వచ్చి యుద్ధంచేసి పదకొండు సీట్లతో శుద్ధంగా గుండు గీయించుకున్నారు.

తన నాన్నలా మన అనుకున్నవారిని ఆదరించలేదు. తన నాన్నలా తనకంటూ నిజాలు చెప్పగలిగే సొంత మనుషులని నియమించుకోలేదు. తన నాన్నలా ప్రజల సమస్యలు తెలుసుకోలేదు. తన నాన్నలా జనం మధ్యలో తిరగలేదు. తన నాన్నలా రోజుకి 16గంటలు పనిచేయలేదు. తన నాన్నలా రాజకీయ పరిపక్వతని ప్రదర్శిం చలేదు. తన నాన్నలా పాలనలో తనదైన ముద్ర వేసుకోలేదు. తన నాన్నలా నిరాడం బర జీవితాన్ని సాగించలేదు. తన నాన్నలా ఇంటి గుట్టుని ఇంటికే పరిమితం కానీయ లేదు. తన నాన్నలా ప్రజాదరణ పొంది రెండవసారి అధికారంలోకి రాలేదు.

జనసేవే పరమావధిగా నాన్న పాలన సాగితే.. ధనార్జనే తన విధిగా జగన్ పరిపాలన కొనసాగింది. అందుకనే ఆయన అలా.. ఈయన ఇలా..!

**మహానేతా మన్నించు!..**

– రాజశేఖరరెడ్డి 75వ జయంతి సందర్భంగా బాధాతప్త హృదయంతో..!!

# వచ్చారు... వెళ్లారు!

(3వ పేజీ తరువాయి)

### విడ్డూరంగా ఉందే..!

ఎన్నికల సమయంలో ఈవిఎంలను ధ్వంసం చేసిన కేసులో పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి అరెస్టు అయ్యారు. ఆయనపై కేసు పెట్టింది ఎన్నికల సంఘం. చట్ట ప్రకారం ఈ నేరానికి పిన్నెల్లికి ఏడేళ్ళ శిక్షపడే అవ కాశం ఉందని కూడా న్యాయ నిపుణులు చెప్తున్నారు. అలాంటి వ్యక్తిని పరామర్శించ డానికి జగన్ రావడమే విచిత్రం అని రాజ కీయవర్గాలు ఓ వైపు చర్చించుకుంటు న్నాయి. ఇలాంటి తరుణంలో, వచ్చినవారు వచ్చినట్లు వెళ్ళకుండా అధికారంలోకి వచ్చి ఇంకా నెలరోజులైనా కాని చంద్రబాబుకి తొందరలోనే రోజులు దగ్గర పడ్డాయని జగన్ మాట్లాడడంతో, ఔరా ఇదేం విడ్డూరం అని జనం మరోవైపు ముక్కున వేలేసుకుంటున్నారు!

# కార్పొరేషన్లను బలోపేతం చేస్తాం

## - మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ




రాష్ట్రంలోని కార్పొరేషన్లను బలోపేతం చేసేందుకు తెలుగు దేశం ప్రభుత్వం సత్వరచర్యలు తీసుకుంటోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. ఇటీవల ఆయన అమరావతిలోని సచివాలయంలో రాష్ట్రంలోని 17 మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్పొరేషన్లు ఆర్థికంగా పటిష్టవంతంగా ఉండేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో పరిశీలిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రజల అభ్యున్నతి, ముఖ్యంగా నిరుపేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా టీడీపీ ప్రభుత్వ పరిపాలన ఉంటుందన్నారు. ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితుల్లో ప్రజల ఆరోగ్యం దృష్ట్యా, సీజనల్ వ్యాధులు విస్తరించకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. డయేరియా, డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధుల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను, త్రాగునీటి సరఫరాను మెరుగుపరిచేందుకు చేపడుతున్న తీరును ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మున్సిపల్ కార్పొరేషన్లను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలను అడిగి తెలుసుకున్నారు. అన్ని ప్రాంతాల ప్రజలకు తాగునీటిని సక్రమంగా సరఫరా చేయాలని, ప్రతి ఇంటికి స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలన్నదే తమ ధ్యేయమని అన్నారు. అదేవిధంగా, పారిశుధ్య పరిరక్షణలో భాగంగా, ఈ నెలాఖరులోపు కాలువల్లో మురుగునీరు నిల్వ ఉండ కుండా పూడికలు తీయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్, సిడిఎంఏ శ్రీధర్, టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత, పబ్లిక్‌హెల్త్ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ ఆనందరావు, మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు పాల్గొన్నారు.

### శ్రీసిటీ ఉద్యోగుల

## భవిష్యనిధి, బీమా సేవలపై సదస్సు



ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ), ఉద్యోగుల రాష్ట్ర బీమా పథకం (ఈఎస్ఐసి) సంయుక్త ఆధ్వర్యంలో 'నిధి ఆప్కే నికట్ 2.0' పేరిట శ్రీసిటీ వాణిజ్య కేంద్రంలో ఇటీవల ఉద్యోగుల భవిష్యనిధి, బీమా సేవలపై ఇటీవల అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈపీఎఫ్ఓ తిరుపతి జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ప్రేమలాల్, ఈఎస్ఐసి తిరుపతి బ్రాంచి మేనేజర్ సి.నాగమణి ఈ సదస్సులో పాల్గొని పైఅంశాలపై వివరంగా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. వివిధ కంపెనీలకు చెందిన సుమారు 100 మంది మానవ వనరుల ప్రతినిధులు (హెచ్ఆర్‌లు) హాజరై, ఈపీఎఫ్ఓ ద్వారా ప్రభుత్వం చేపడుతున్న వివిధ చర్యలను సమగ్రంగా వివరించారు. ఈ–నామినేషన్, యుఏఎన్ యాక్టివేషన్, కెవైసి అప్‌డేటింగ్, బ్యాంక్ ఆధార్ సీడింగ్, ఆన్‌లైన్ ఈసీఆర్ ఫైలింగ్, ఎంప్లాయీస్ డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ పథకం, ఉద్యోగుల పెన్షన్ పథకాలకు సంబంధించి ఉద్యోగులు లేవనెత్తిన పలు సందేహాలను నివృత్తి చేశారు. పై పథకాల ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమ నిర్వహణ పట్ల శ్రీసిటీ హెచ్ఆర్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వి.శివకుమార్‌రెడ్డి ఈపిఎఫ్ఓ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. జ్ఞానాన్ని పెంపొందించడానికి, పరస్పర సమాచార మార్పిడికి ఇది ఒక మంచి వేదికగా ఆయన పేర్కొన్నారు. పై అంశాలకు సంబంధించి ఉద్యోగుల ఫిర్యాదులను పరిష్కరించడానికి శ్రీసిటీలో ఒక హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటుచేయాలని వారు సూచించారు.

## రామతీర్థం బ్రహ్మోత్సవాల్లో అన్నదానం



విడవలూరు మండలంలోని రామతీర్థంలో కొలువైవున్న శ్రీ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా, జూన్ 30న పెద్దఎత్తున అన్నదానం జరిగింది. స్వామివారి పులివాహనోత్సవం రోజున, గాదెలదిన్నె గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, స్వర్గీయ వెల్లంపల్లి పార్థసారథి జ్ఞాపకంగా కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో పెద్దఎత్తున భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ సందర్భంగా కోవూరు ఏఎంసి మాజీ ఛైర్మెన్ రామిరెడ్డి విజయభానురెడ్డి మాట్లాడుతూ, స్వామివారి భక్తులకు అన్నవితరణ చేయడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహాయ సహకారాలతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ఎంతో ఘనంగా జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెల్లంపల్లి దిలీప్‌కుమార్, టి.కరుణాకర్, కొండూరు శ్రీధర్, అంకయ్య, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఆర్ఎంగా.. విజయరత్నం



జిల్లా ప్రజారవాణా (ఏపీఎస్ ఆర్టీసీ) అధికారిగా ఉన్న పీవీ శేషయ్య ఇటీవల ఉద్యోగ విరమణ చేయడంతో, ఆయన స్థానంలో విజయవాడ ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో చీఫ్ మెకానికల్ ఇంజనీరింగ్ మెయింటినెన్స్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న జి.విజయరత్నం నియమితులయ్యారు. నెల్లూరులోని ప్రధాన ఆర్టీసి బస్టాండ్ ప్రాంగణంలోని చాంబర్‌లో ఆయన ఇటీవల ఆమేరకు బాధ్యతలు స్వీకరించారు. కొత్త ఆర్ఎంకు 'లాయర్' శుభాకాంక్షలు.

## పశుసంవర్ధకశాఖ జేడీగా.. కోటేశ్వరరావు

జిల్లా పశుసంవర్ధకశాఖ ప్రధాన కార్యాలయంలోని వెటర్నరీ పాలీక్లినిక్ డిప్యూటీ డైరెక్టర్‌గా ఉన్న వి.కోటేశ్వరరావు తాజాగా ఆ శాఖ ఇన్‌చార్జి జేడీగా నియమితులయ్యారు. జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారుల సంఘం అధ్యక్షుడు టి.సోమయ్య, రాష్ట్ర నాయకుడు ఎస్.జయచంద్ర తదితరులు ఆయన్ను కలిసి అభినందనలు తెలిపారు.

## వాత్సల్యకు రూ. 50వేల విరాళం



నెల్లూరులోని వాత్సల్య–జనహిత శరణాలయానికి ప్రముఖ వైద్యులు శ్రీనివాసరాజు తన పుట్టినరోజు సందర్భంగా ఈనెల3న 50వేల రూపాయల విరాళాన్ని వాత్సల్య నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస రాజును నిర్వాహకులు సన్మానించారు. వాత్సల్య కార్యదర్శి సాంబశివరావు, డాక్టర్ రవి, ఎం.హరిబాబు, బిఎంఎస్ నాయకుడు ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

## 'ఎనెల్' ఉచిత వైద్యశిబిరం

నెల్లూరులోని ఎనెల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఇటీవల నెల్లూరు సమీపంలోని చెముడుగుంట గ్రామంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రోగులకు ఈసీజీ, రక్తపరీక్షలు, షుగర్‌వ్యాధి నిర్ధారణకు వైద్యపరీక్షలు చేసి, వారికి అవసరమైన మందులను పంపిణీ చేశారు. సర్వేపల్లి టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ ఈ శిబిరాన్ని సందర్శించి రోగులను పరామర్శించారు. ఆసుపత్రి ఛైర్మెన్ దశరథనాగేంద్ర ప్రసాద్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.నాగేంద్రప్రసాద్, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

## దుంగలు దొరికాయి.. దొంగలు పారిపోయారు

ఇటీవల రాపూరు మండలంలోని పెంచలకోన మలుపు సమీపంలో తెగచర్ల క్రాస్‌రోడ్డు వద్ద పోలీసులు గస్తీ కాస్తుంటే, ఓ కారు ఆగకుండా వేగంగా అడవిలో ఉన్న పొదల్లోకి దూసుకువెళ్ళింది. పోలీసులు వెంటపడడంతో కారులో ఉన్నవారంతా దిగేసి పరారయ్యారు. కారులో చూస్తే.. అందులో సుమారు రూ.3 లక్షల విలువచేసే ఎర్రచందనం దుంగలు న్నాయి. కారుతో పాటు ఆ దుంగలను రాపూరు సిఐ సుబ్రహ్మణ్యం స్వాధీనం చేసుకున్నారు. మొత్తానికి దుంగలు దొరికాయి... దొంగలు పారిపోయారు.

## టూకీగా...

### మనుబోలులో పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

మనుబోలులోని కోదండరామపురం దేవాంగులవీధిలో వెలసివున్న శ్రీ పోలేరమ్మ అమ్మవారికి ఇటీవల ఆలయ అర్చకులు ప్రత్యేకపూజలు చేసి, నవావరణ పూజ, ఖడ్గమాలార్చన, కుంకుమార్చనతో పాటు పంచామృతాభిషేకం నిర్వహించారు. గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించుకుని, మొక్కులు తీర్చుకున్నారు.

### కోవూరులో వైద్యులకు సన్మానం

జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఈనెల 1న కోవూరులో పలువురు వైద్యులను ఘనంగా సన్మానించారు. స్థానిక జడ్పీ బాలికల పాఠశాలలో పెద్ది ప్రభావతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, 13 మంది వైద్యులను సత్కరించి వారి సేవలను అభినందించారు. ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటాచలపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### ఉలవపాడులో ఉత్సాహంగా..'చదవడం మాకిష్టం'

మండలకేంద్రమైన ఉలవపాడులోని గ్రంథాలయం ఉద్యోగులు ఇటీవల చిన్నారులకు 'చదవడం మాకిష్టం' కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కథలు, జాతీయనాయకుల జీవిత చరిత్రలను తెలియజేసే పుస్తకాలను వారిచే చదివించారు. అనంతరం క్యారమ్స్ ఆడించారు.

### గొట్టిగుండాలలో భగవద్గీత ప్రచారం

కొండాపురం మండలం గొట్టిగుండాల గ్రామంలో ఇటీవల త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞానవేదిక దుత్తలూరు కమిటీ వారు భగవద్గీత విశిష్టతపై ప్రచారం నిర్వహించారు. కమిటీ అధ్యక్షులు జి.ప్రసాద్, కె.వెంకటేశ్వర్లు, జి.పెంచలరత్నం, కె.నర్సింహులు, ఎం.నాగమ్మ, వై.మహేంద్ర, డి.మధు, వి.కొండలరావు, డి.రమణయ్య, ఎం.సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

### వడ్డిపాళెం రామాలయంలో చోరీ

నెల్లూరు రూరల్ మండలం వడ్డిపాళెం గ్రామంలోని రామాలయంలో ఇటీవల దొంగలుపడి సీతమ్మవారి మెడలోని బంగారుకాసులు, తాళిబొట్టుతో పాటు హుండీలో ఉన్న సుమారు 50వేల రూపాయలను కూడా దొంగిలించుకు పోయారు. రూరల్ పోలీసులకు ఈ సమాచారం అందడంతో వారు వచ్చి ఘటనాస్థలాన్ని పరిశీలించారు.

### వెంగారెడ్డిపాళెం వద్ద కందకాలు

సంగం మండలం వెంగారెడ్డిపాళెం గ్రామ సమీపంలో ఉన్న పెన్నానదిలో ఇసుక అక్రమతవ్వకాలకు అడ్డుకట్టవేస్తూ అధికారులు ఇటీవల కందకాలు తవ్వించారు. అక్రమ వాహనాల రాకపోకలు జరగకుండా తహశీల్దారు రమాదేవి ఆదేశాలతో కందకాలు ఏర్పాటుచేయడం వల్ల అక్రమార్కులకు చెక్ పెట్టినట్లయిందని గ్రామస్తులు సంతోషిస్తున్నారు.

### దుత్తలూరులో పూర్వవిద్యార్థుల వితరణ

దుత్తలూరు జడ్పీ ప్రభుత్వ ఉన్నతపాఠశాల పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న ఆ పాఠశాలలో వాటర్‌ట్యాంకు నిర్మాణం కోసం ఇటీవల రూ.30వేలు విరాళంగా అందించారు. 1993లో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులంతా ఇటీవల ఆత్మీయసమావేశం నిర్వహించారు. పాఠశాల వంటగది నిర్మాణానికి కూడా ఆర్థిక సహకారం అందిస్తామన్నారు.

### కొండ బిట్రగుంట ప్రసన్నునికి ఊంజల్‌సేవ

బోగోలు మండలం కొండ బిట్రగుంటలో కొలువైవున్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామికి ఇటీవల సహస్రదీపాలంకరణ సేవ, ఊంజల్‌సేవలను వేడుకగా నిర్వహించారు. ఆలయ ఇఓ రాధాకృష్ణ పర్యవేక్షణలో, అర్చకుల నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

### రాళ్ళపాడు విద్యార్థులకు నోట్‌పుస్తకాలు

గుడ్లూరు మండలం రాళ్ళపాడు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఇటీవల దాత దగ్గుమాటి సుబ్బారావు ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్స్, పలకలు అందజేశారు. ఎంఇఓ శ్రీనివాసరావు, సర్పంచ్ శ్రీను, వై.రమణయ్య, డి.ఎల్లయ్య, వై.దశరథరామయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మీయ సంబరంగా.. మన వెంకయ్య పుట్టినరోజు వేడుక

**రమణీయ, కమనీయ, ఆత్మీయ, చిరస్మరణీయ వేడుకగా జరిగిన వెంకయ్య 'పంచ సప్తతి'**

**వెంకయ్యనాయుడి జీవిత విశేషాలతో కూడిన 3పుస్తకాలను ఆవిష్కరించిన ప్రధాని నరేంద్ర మోడీ**



**తన మాటలు, చేతలు, సేవలతో దేశ ప్రజలందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచిన మహనీయ నాయకుడు, ప్రముఖ రాజనీతిజ్ఞుడు.. భరతమాత ముద్దుబిడ్డ.. భారత మాజీ ఉప రాష్ట్రపతి..ముప్పవరపు వెంకయ్యనాయుడు 75వ పుట్టినరోజు వేడుక జూన్ 30 ఆదివారం నాడు హైదరాబాద్‌లో ఆత్మీయులు, కుటుంబ సభ్యులు, రాజకీయనాయకులు, అనేక మంది ప్రముఖుల మధ్య ఆత్మీయ సంబరంగా జరిగింది. కేంద్ర, రాష్ట్రాల నుంచి పలువురు నాయకులు ఈ సంబరాల్లో పాల్గొని వెంకయ్యకు శుభాకాంక్షలు చెప్పారు. దీంతో వెంకయ్య పుట్టిన రోజు సంబరాలు జరిగే గచ్చిబౌలిలోని ఫంక్షన్‌హాల్ ప్రాంగణమంతా ఆనందోత్సాహాలతో సందడిగా మారింది.**

తానెంత ఉన్నతస్థాయిలో ఉన్నా, చిన్నాపెద్దా తేడా లేకుండా అందరితో కలసిమెలసి ఉంటూ, 'అందరివాడు'గా అందరి మనసుల్లో మంచిస్థానం సాధించుకున్న వెంకయ్యను, తన స్వస్థలమైన నెల్లూరుజిల్లాకు చెందిన పలువురు బీజేపీ నాయకులు, ముఖ్యులు స్వయంగా కలసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. వెంకయ్య 'పంచ సప్తతి' సందర్భంగా 75వ వసంతంలోకి అడుగుపెడుతున్న తమ అభిమాన నాయకునికి ఆత్మీయులంతా శుభాభినందనలు తెలిపారు. వెంకయ్య సతీమణి ఉషమ్మ, కుమార్తె దీపమ్మ.. వారి కుటుంబసభ్యులు, బంధుమిత్రులు..ఆత్మీయులందరితో కలసి వెంకయ్య తన 75వ పుట్టినరోజును ఆనందంగా జరుపుకున్నారు.



## మంచి ఆలోచనలు.. గొప్ప వ్యక్తిత్వం ఆయన సొంతం

### వెంకయ్యను కొనియాడిన ప్రధాని నరేంద్ర మోడీ

'దేశ మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు మంచి ఆలోచనలు, గొప్ప వ్యక్తిత్వం, దార్శనికతలున్న నాయకులని, ఆయన జీవితం తనతోపాటు లక్షలాది మంది కార్యకర్తలకు స్ఫూర్తిదాయకమని' ప్రధాని నరేంద్రమోడీ కొనియాడారు. వెంకయ్య రాజకీయజీవితం భావితరాలకు స్ఫూర్తి అంటూ కీర్తించారు. దేశ ప్రయోజనాలే పరమావధిగా భావించి రాజకీయాలను, అధికారాన్ని ప్రజలకు సేవచేసే మార్గంగా ఎంచుకుని ముందుకు సాగిన నేత వెంకయ్యనాయుడని ప్రశంసించారు. జులై 1న వెంకయ్యనాయుడు 75వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని, జూన్ 30 ఆదివారం నాడు వెంకయ్య కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లో నిర్వహించిన ఆత్మీయ కలయికలో ప్రధాని నరేంద్ర మోడీ ఢిల్లీ నుంచి వర్చువల్‌గా పాల్గొని వెంకయ్యకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం, వెంకయ్యనాయుడు జీవిత విశేషాలను వివరంగా తెలియజెప్పే అత్యద్భుతమైన మూడు పుస్తకాలను ఆవిష్కరించారు. **'వెంకయ్యనాయుడు-ఏ లైఫ్ ఇన్ సర్వీస్', 'సెలబ్రేటింగ్ భారత్'** అనే రెండు ఆంగ్లగ్రంథాలతో పాటు, **'మహానేత'** వెంకయ్యనాయుడి జీవిత చిత్రకథ పేరుతో మరో తెలుగు పుస్తకాన్ని కూడా ప్రధాని వర్చువల్‌గా ఆవిష్కరించారు. ఈ పుస్తకాలు ప్రజలకు ప్రేరణగా నిలుస్తాయని ప్రధాని మోడీ అన్నారు. వెంకయ్యనాయుడు లాంటి నాయకుల సుదీర్ఘసేవల వల్లే బీజేపీ ఇవాళ సమున్నతమైన స్థాయిలో ఉందని, సుదీర్ఘకాలం ఆయనతో పనిచేసే అవకాశం తనకు కలిగిందన్నారు. 50ఏళ్ల నాటి ఎమర్జెన్సీ చీకటిరోజుల్లో వెంకయ్య ప్రాణాలు పణంగాపెట్టి పోరాడి, 17నెలల పాటు జైలులో ఉన్నారని ఆయనన్నారు. వెంకయ్యనాయుడి వాక్పటిమ గురించి ఎంతచెప్పినా తక్కువేనని, ఆయన వాగ్ధాటి ముందు ఎవరూ నిలవలేరని అంటూ, రాజ్యసభ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు సభలో ఎదురైన ఎన్నో వివాదాలను వెంకయ్య ఎంతో హుందాగా పరిష్కరించారని ప్రధాని అన్నారు. ముఖ్యంగా ఆర్టికల్ 370 రద్దు బిల్లును సభలో ప్రవేశపెట్టినప్పుడు ఆ సమయంలో ఎన్డీఏకి సంఖ్యాబలం తక్కువగా ఉన్నప్పటికీ, ఇతరపార్టీల మద్దతును కూడగట్టి, ఆ బిల్లు నెగ్గేలా చేయడం ఒక్క వెంకయ్యనాయుడికే సాధ్యమైందని ప్రధాని గుర్తుచేసుకుంటూ, వెంకయ్య సేవలను దేశం ఎన్నటికీ మరిచిపోదని ప్రస్తుతించారు.


## మానవీయ విలువలను పాటించాలి



**- వెంకయ్య**

బలహీనవర్గాల వారి అభ్యున్నతి కోసం ప్రధాని మోడీ అద్భుతమైన సేవలందిస్తున్నారని వెంకయ్యనాయుడు ఈ సందర్భంగా అన్నారు. రాజకీయ నాయకుల గురించి ప్రస్తావిస్తూ, రాజకీయాల్లో హుందాగా ఉండాలని, అందులోనూ చట్టసభలకు ఎన్నికైన వారు మరింత హుందాగా ప్రవర్తించాలని, ముఖ్యంగా మానవీయ విలువలను పాటించాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజలకు సేవచేయాలనుకునేవారు రాజకీయాల్లోకి రావాలని, సిద్ధాంత పరమైన రాజకీయాలను ప్రోత్సహించాలని అన్నారు. ఒక పార్టీ సిద్ధాంతాలు నచ్చక వేరొక పార్టీలోకి వెళ్ళాలనుకున్నప్పుడు, అంతకుముందు ఆ పార్టీ ద్వారా వచ్చిన పదవికి రాజీనామా చేసిన తర్వాతే పార్టీ మారాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. భారతీయభాషలకు ప్రాధాన్యత నివ్వాలని ఆయన చెప్తూ, మొదట మాతృభాష, తర్వాత సోదరభాష, ఆ తర్వాతే ఏ భాషైనా అని అన్నారు. ప్రభుత్వాలు గ్రామీణ-పట్టణ ప్రాంతాల మధ్య అంతరాలను తొలగించాలని, వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యతను ఇవ్వాలని సూచించారు. అవసరమైనంతకాలం ఉచిత బియ్యంతో పేదలకు అండగా నిలవచ్చని, అయితే ఉచితాలను అలవాటు చేయడం సముచితం కాదని అభిప్రాయపడ్డారు.

ఈ వేడుకల్లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, తెలంగాణ గవర్నర్ రాధాకృష్ణన్,మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు, ఆంధ్రప్రదేశ్ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, ఎంపీ భరత్, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కామినేని శ్రీనివాసరావు, రఘురామకృష్ణంరాజు, సుజనా చౌదరి, మాజీమంత్రి మల్లారెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త గ్రంధి మల్లికార్జునరావు, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు, తెలంగాణ-ఏపీ హైకోర్టుల న్యాయమూర్తులు జస్టిస్ రామకృష్ణప్రసాద్, జస్టిస్ హరినాథ్, మాజీ ఎంపీలు కంభంపాటి రామ్మోహన్‌రావు, సి.రామచంద్రయ్య, మాజీ ఐఏఎస్‌లు నిమ్మగడ్డ రమేశ్, కె.లక్ష్మీనారాయణ, ప్రముఖ శాస్త్రవేత్త సతీష్‌రెడ్డి, మాజీ డీజీపీలు ఆర్‌పి ఠాకూర్, దినేశ్‌రెడ్డిలతో పాటు సినీ ప్రముఖులు మురళీమోహన్, కీరవాణి, నందమూరి రామకృష్ణ తదితర ప్రముఖులంతా వచ్చి వెంకయ్యకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com